

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 83 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 14, ఫిబ్రవరి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# పాలకులు మారకపోతే ప్రజలు మారుతారా.?

## ప్రజాస్వామ్య ప్రభుత్వాలలో పాలకులదే హవా

రాష్ట్రాల పరిధిలోని ఉన్నత విద్యను కేంద్రం కులదోసే కుట్రలు పన్నుతుంది
ప్రజా సేవను ప్రాణంతో సమానంగా భావించినోళ్లకే విలువ ఉంటుంది
ప్రజల్లో చైతన్యం రాకపోవడానికి అణిచివేతే కారణమా.?
ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై న్యాయస్థానాలే పోరాటాలకు దిగాలి
అనిచివేత ఎక్కువైతే ఉద్యమాలు ఉద్భవిస్తాయి
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో పేదలకు తీరని అన్యాయం జరుగుతుంది
ప్రజలు మారాలంటే ప్రభుత్వాలు నిజాయితీ పాలనను అందించాలి
ఉచితలకు ప్రజలను అలవాటుపరచి సోమరులను తయారు చేస్తున్నారు
డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో పాలకుల తీరు ప్రజా వ్యతిరేకతను పాటిస్తుండడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల పట్ల కొనసాగుతున్న ఉద్యమాలను అణిచివేయడం వల్ల ప్రజల్లో చైతన్యం రాకపోవడానికి ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వాల ఏర్పాటుకు సామాన్య ప్రజల ఓట్లు ఎంత ప్రాముఖ్యమో ప్రభుత్వాలు గుర్తించకపోవడం అప్రజాస్వామికమన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ప్రకటించి ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల్లో గట్టెక్కడం రాజకీయ నాయకులకు అలవాటుగా మారిపోయిందన్నారు. ప్రభుత్వాలపై తిరుగుబాటుతనాన్ని ప్రదర్శిస్తున్న ఉద్యమకారులను మేధావులను



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

పండితులను ప్రజలను ఎక్కడికి అక్కడ అణిచివేస్తూ ప్రభుత్వాల పరిధిలో ఆయా వర్గాలను దిగ్బంధించి కట్టడి చేయడం వల్ల ప్రజలలో చైతన్యం కొరబడిందన్నారు. ప్రజలు మారకపోవడానికి ఉచితాలే కారణమని వాటిని అనేకం ఏర్పరిచి ప్రభుత్వాలను అప్పుల్లోకి నెట్టివేయడం ఆయా ప్రభుత్వాల పాలనలలో అసమర్థత నాయకుల తీరు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వాల అధికారం కోసం ప్రజలను మోసగించడం అన్ని పార్టీలు అలవాటుగా

- మిగతా 5లో..

# 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

కెసిఆర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు
ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం



హైదరాబాద్,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్) :

ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ రావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

## గాజా.. పాలస్తీనీయులదే




బీజింగ్ : గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను చైనా ఖండించింది. ''గాజా ప్రాంతం పాలస్తీనీయులదే. అక్కడినుంచి వారిని బలవంతంగా తరలించేందుకు మేం వ్యతిరేకం'' అని స్పష్టం చేసింది. అలాగే అరబ్ లీగ్ నుంచి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. వారిని తరలించడం ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించింది. గాజాలో ఉన్న పాలస్తీనా వాసులంతా పశ్చిమాసియాలోని వేరే ఏదైనా ప్రాంతానికి వెళ్లి శాశ్వతంగా స్థిరపడితే అమెరికా బాధ్యత తీసుకుని గాజాను పునర్నిర్మించాలని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. ''పాలస్తీనియన్లు వేరేచోట స్థిరపడిన తర్వాత గాజా స్ట్రిప్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ఇజ్రాయెల్ అమర్చిన ప్రమాదకరమైన బాంబులను, ఆయుధాలను నిర్వీర్యం చేసే బాధ్యతను తీసుకుంటుంది'' అని వెల్లడించారు. ''దాడుల వల్ల అక్కడ నామరూపాల్లేకుండా ధ్వంసమైన భవనాలను పునర్నిర్మిస్తుంది. కాంక్రీటు శిథిలాల కింద అక్కడ ప్రజలు ఉంటున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు, ఇళ్లు లభించేలా చూడవచ్చు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

## తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు



జెనీవా : గత వేసవి కాలంలో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ సామూహికంగా ప్రదర్శనలు, ధర్నాలు, ఆందోళనలు చేసిన నిరసనకారులపై ఆనాటి ప్రభుత్వం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ బుధవారం చెప్పారు. ఈ మేరకు బంగ్లాదేశ్ మాజీ ప్రభుత్వం, భద్రతా యంత్రాగం వ్యవస్థాగతంగా పాల్పడిన నేరాలను, ఉల్లంఘనలను పేర్కొంటూ నిజ నిర్ధారణ కమిటీ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా జెనీవాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భయాందోళనలు, మూకుమ్మడి అరెస్టుల నేపథ్యంలో ఈ నేరాలన్నీ చోటు చేసుకుని వుండవచ్చన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకారులను, ఆ ఆందోళనలకు సానుభూతి తెలిపేవారిని హింసాత్మకంగా అణచివేయాలని, దాడులు జరపపాలని అధికారిక విధానంగా వుందని, అందుకు బంగ్లాదేశ్ సీనియర్ అధికారులు వెల్లడించిన సాక్ష్యాధారాలు వున్నాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోటాకు వ్యతిరేకంగా విద్యార్థుల నేతృత్వంలో మొదలైన ఉద్యమం చాలా త్వరగా దేశవ్యాప్తంగా విస్తరించింది.

## మస్క్‌కు విస్తృత అధికారాలు



వాషింగ్టన్ : ప్రపంచంలో అత్యంత సంపన్నుడు ఎలాన్ మస్క్‌ను ఇటీవలి వారాల్లో యుఎస్ ప్రభుత్వానికి చెందిన వివిధ కార్యాలయాలపై ఆధిపత్యం వహించనివ్వడం అనేక మంది అమెరికన్లలో భీతాహం సృష్టించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అండ, సిసలైన నమ్మకస్థుల చిన్న బృందం మద్దతు ఉన్న మస్క్ అమెరికాలోని విస్తృత ఫెడరల్ అధికారయంత్రాంగాన్ని విజయవంతంగా చేతుల్లోకి తీసుకున్నారు. మస్క్‌కు మరింత అధికారం ఇస్తూ ట్రంప్ మంగళవారం ఒక ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేశారు. తమ సిబ్బంది సంఖ్యను కుదించడంలోను, కొత్తవారి నియామకాలను పరిమితం చేయడంలోను మస్క్ ఆధ్వర్యంలోని 'ప్రభుత్వ సామర్థ విభాగం (డిఒజిఇ డోగె)తో ఫెడరల్ సంస్థలు సహకరించాలని ఆ ఉత్తర్వు కోరుతోంది. 'ప్రత్యేక' ప్రభుత్వ ఉద్యోగిగా ట్రంప్ ప్రభుత్వంలో చేరిన తరువాత మీడియాతో మొదటిసారి మాట్లాడిన మస్క్ యుఎస్ ప్రభుత్వంపై తాను 'ఆధిపత్యం' వహిస్తున్నట్లుగా వినవస్తున్న విమర్శలకు స్పందించారు. భారీ ఎత్తున ప్రభుత్వ సంస్కరణ కోసం ప్రజలు వోటు వేశారని, ప్రజలకు అదే లభించబోతున్నదని ఆయన చెప్పారు.

# మైక్రోసాఫ్ట్ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి






హై్ద్రాబాద్ జై భీమ్ న్యూస్

హైదరాబాద్ నగరంలో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించు కోవడం మనందరికీ గర్వ కారణం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఐటి జర్నీలో ఇదొక మైలు రాయి అని అభివర్ణించారు. మైక్రో సాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించ నున్నాయని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని ఇవాళ గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్ర మానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటిం చారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటా ర్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# సంపాదకీయం

## అనుభవశాలి దామోదరం సంజీవయ్య

దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి, అలాగే తొలి దళిత ముఖ్యమంత్రి. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో, ఆంధ్రరాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో అనేకసార్లు ఆయన మంత్రి పదవులు నిర్వహించగా, రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పనిచేసిన ప్రత్యేకత ఆయనది. అలాగే కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షులు కూడా. 38 ఏళ్ల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కింది. వివిధ శాఖల్లో మంత్రిగా పని చేసిన గొప్ప రాజకీయవేత్త, అపార అనుభవశీలి, స్నేహశీలి, సౌమ్యుడు, సాహితీవేత్త, ఆదర్శప్రాయుడు, చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య. దామోదరం సంజీవయ్య, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వంలో తెలుగు భాష వాడుక అధికం చేయడం, భూసంస్కరణల అమలు ఇలా ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు ఆయన హయాంలో చేపట్టారు. దామోదరం సంజీవయ్య (ఫిబ్రవరి 14,1921 – మే 8,1972) 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా, కల్లూరు మండలంలో, కర్నూలు నుండి ఐదు కిలోమీటర్ల దూరములో ఉన్న పెద్దపాడు లో చదువుకోవటానికి అవకాశాలు లేని ఒక దళిత నిరుపేద కుటుంబంలో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారు. పేద కుటుంబంలో పుట్టినా పట్టుదలే పెట్టుబడిగా 'లా' డిగ్రీ సాధించిన అనన్యుడు. పెద్దపాడులో 4వ తరగతి వరకు చదివి ఆ తరువాత కర్నూలులోని అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ పాఠశాలలో చేరారు. 1935లో కర్నూలు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో చేరి 1938లో ఎస్.ఎస్.ఎల్.సీ జిల్లాలోనే ప్రథమునిగా ఉత్తీర్ణుడయ్యారు. తరువాత చిన్నయ్య ఆర్థిక సహాయముతో అనంతపురం దత్తమండల కళాశాలలో గణితము, ఖగోళ శాస్త్రములు అధ్యయనము చేశారు. 1942లో బీ.ఏ పూర్తి చేసిన తర్వాత జీవనోపాధి కొరకు అనేక చిన్నా చితక ఉద్యోగాలు చేశారు. అప్పుడు రెండవ ప్రపంచ యుద్ధము వలన ఉద్యోగాలు దొరకడము చాలా కష్టముగా ఉంది. సంజీవయ్య కర్నూలు పట్టణ రేషనింగ్ ఆఫీసులో గుమస్తాగా 48.80 రూపాయల జీతముతో ఉద్యోగములో చేరారు. 1944 లో కొంతకాలము మద్రాసు కేంద్ర ప్రజా పనుల శాఖ కార్యాలయములో సహాయకునిగా పనిచేశాడు. 1945 జనవరిలో కేంద్ర ప్రజా పనుల శాఖ తనిఖీ అధికారిగా బళ్లారిలో పని చేశారు. ఈ గజెటెడ్ హోదా కల ఉద్యోగము డిసెంబరు 1945 లో రద్దయ్యేదాకా 11 నెలల పాటూ పని చేశారు. ఆ తరువాత కొంత సమయము మద్రాసులోని పచ్చయప్ప పాఠశాలలో అధ్యాపకునిగా పని చేసారు. సంజీవయ్య 1946లో అప్పటి బళ్లారి జిల్లా జడ్జి కే.ఆర్.కృష్ణయ్య చెట్టి ప్రోత్సాహముతో మద్రాసు లా కాలేజీలో 'ఎఫ్.ఎల్' లో చేరారు. అప్పట్లో కాలేజిలో స్కాలర్‌షిప్పు ఇచ్చే పద్ధతి ఉండేది కాదు. అందువలన సంజీవయ్య మద్రాసు జార్జ్‌టౌన్ లోని ప్రోగ్రెస్సివ్ యూనియన్ ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం గణిత అధ్యాపకునిగా పనిచేశారు. అక్కడ ఇచ్చే 90 రూపాయల జీతముతో హాస్టలు ఖర్చులు భరించేవాడు. లా చదువుతున్నపుడు సంజీవయ్యకు రోమన్ న్యాయానికి సంబంధించిన లాటిన్ పదాలు గుర్తు పెట్టుకోవడము కష్టమయ్యేది. లాలో ఆయనకు సహాధ్యాయి అయిన ప్రముఖ రచయిత రావిశాస్త్రి వాటిని తెలుగు పాటగా మలిచి పాడుకుంటే బాగా గుర్తుంటాయని సలహా ఇచ్చారు. లా చదివే రోజుల్లో సంజీవయ్య చంద్రగుప్త అనే నాటకములో పాత్ర ధరించాడు. శివాజీ అనే ఇంకొక నాటకాన్ని తామే రచించి రంగస్థలము మీద ప్రదర్శించారు. ఈయన గయోపాఖ్యానము గద్యముగా రచించారు. అయితే ఇందులో ఏ ఒక్కటి ప్రస్తుతము లభ్యము అవుటలేదు. లా పట్ట చేతపుచ్చుకొని సంజీవయ్య 1950 అక్టోబర్ లో మద్రాసు బార్ లో న్యాయవాదిగా నమోదు చేసుకొన్నాడు. ఆయన గణపతి వద్ద ఆ తరువాత జాస్తి సీతామహా లక్ష్మమ్మ వద్ద సహాయకునిగా పనిచేశారు. సంజీవయ్యకు విద్యార్థిగా ఉన్న రోజుల్లో రాజకీయాలపై, స్వాతంత్ర్యోద్యమముపై ఏమాత్రము ఆసక్తి చూపలేదు. కానీ లా అప్రెంటిసు చేస్తున్న సమయములో వివిధ రాజకీయ నాయకుల పరిచయము, సాంగత్యము వలన రాజకీయాలలో ప్రవేశించాలనే ఆసక్తి కలిగినది. సంజీవయ్య మంచి వక్త. తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ధారాళంగా, మనోరంజకంగా మాట్లాడేవారు. 1950 జనవరి 26న రాజ్యాంగము అమలు లోకి రావడముతో అప్పటి దాకా రాజ్యాంగ రచన నిర్వహించిన భారత రాజ్యాంగ సభ ప్రొవిజనల్ పార్లమెంట్ గా అవతరించింది. అయితే ప్రొవిజనల్ పార్లమెంటులో, రాష్ట్రాల శాసనసభలలో రెండిట్లో సభ్యత్వము ఉన్న సభ్యులు ఏదో ఒక సభ్యత్వముని ఎన్నుకోవలసి వచ్చింది. షెడ్యూల్డ్ కులమునకు చెందిన ఎస్.నాగప్ప అలా తన శాసనసభ సభ్యత్వము అట్టిపెట్టుకొని ప్రొవిజనల్ పార్లమెంటుకు రాజీనామా చేయడముతో ఆ స్థానమును పూరించడానికి బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తరఫున సంజీవయ్యను ఎంపిక చేశాడు. ఎన్నికలు జరిగి తొలి విధానసభ ప్రమాణ స్వీకారము చేయడముతో 1952 మే 13 న ప్రొవిజనల్ పార్లమెంటు రద్దయినది. టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గములో ఆరోగ్యశాఖా మంత్రిగా ఉండగానే సికింద్రాబాదులో పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కృష్ణవేణిని సంజీవయ్య 1954, మే 7 న పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకున్నాడు. వీరికి సంతానము లేదు. సుజాత అను ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి తన ప్రత్యర్థి అయిన పిడతల రంగారెడ్డిని దెబ్బకొట్టాలని కర్నూలు జిల్లాలోని బస్సురూట్లను జాతీయీకరణ చేశారు. అప్పుడు సుప్రీంకోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందువల్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ స్థానంలో తాత్కాలికంగా కేంద్ర మధ్యవర్తిగా దామోదరం సంజీవయ్యను 1960 జనవరిలో రాష్ట్రానికి తీసుకువచ్చారు. సంజీవయ్య శాసన సభలో అధిక సంఖ్యాకుల బలంతో వచ్చిన వ్యక్తి కాదు. సహజంగా కుల, ముఠా రాజకీయాల మధ్య సతమత మయ్యారు. బలీయమైన రెడ్డి వర్గం ఎ.సి.సుబ్బారెడ్డి నాయకత్వాన ఎదురు తిరిగి సొంత పక్షం పెట్టుకున్నారు. 1962లో ఎన్నికలు జరిగి తిరిగి కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చినపుడు సంజీవయ్య పోటీ చేద్దామను కున్నారు కానీ ఢిల్లీ నాయకత్వం అందుకు అంగీకరించ లేదు. ఎ.సి. సుబ్బారెడ్డి మరీ తలబిరుసు తనంతో కులం పేరు ఎత్తి సంజీవయ్యను ఎద్దేవ చేసారు. 1962లో ముఖ్యమంత్రిగా దిగిపోయిన సంజీవయ్య, గవర్నరుకు రాజీనామా సమర్పించిన మర్నాడే సికిందరాబాదులో తన భార్యను వెంట బెట్టుకుని అజంతా టాకీసులో సినిమాకని నడచి వెళ్ళారు. సంజీవయ్య వ్రాసిన లేబర్ ప్రాబ్లమ్స్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ వారు ప్రచురించారు. 1950 – 1952 ప్రొవిజనల్ పార్లమెంటు సభ్యుడుగా, 1952 ఏప్రిల్ 20 – 1953 అక్టోబర్ 1 రాజాజీ మంత్రివర్గములో మద్రాసు రాష్ట్ర మున్సిపల్, సహకార శాఖా మంత్రిగా, 1953 అక్టోబర్ 1 – 1954 నవంబర్ 15 ప్రకాశం మంత్రివర్గములో ఆంధ్ర రాష్ట్ర ఆరోగ్య, హరిజనోద్ధరణ, పునరావాస శాఖా మంత్రిగా, 1955 మార్చి 28 – 1956 నవంబర్ 1 బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గములో ఆంధ్ర రాష్ట్ర రవాణా, వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా, 1956 నవంబర్ 1 – 1960 జనవరి 10 నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గములో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శ్రమ, స్థానిక స్వయం పరిపాలనా శాఖ మంత్రిగా, 1960 జనవరి 11 – 1962 మార్చి 29 ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 1962 జూన్ – 1964 జనవరి 6 అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు. 1964 జనవరి 24 – 1964 జూన్ 9 నెహ్రూ ప్రభుత్వములో కేంద్ర శ్రమ, ఉద్యోగ శాఖామంత్రిగా, 1964 జూన్ 9 – 1966 జనవరి 23 లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వములో కేంద్ర శ్రమ, ఉద్యోగ శాఖమంత్రిగా, 1966 జనవరి 24 – 1967 మార్చి 12 ఇందిరా గాంధీ ప్రభుత్వములో కేంద్ర పరిశ్రమల శాఖామంత్రి 1970 ఫిబ్రవరి 18 – 1971 మార్చి 18 ఇందిరా గాంధీ ప్రభుత్వములో కేంద్ర శ్రమ, పునరావాస శాఖ మంత్రిగా, 1971 మార్చి 18 నుండి 1972 మే 7 వరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా పని చేశారు. 1967లో ఎన్నికల ప్రచార సమయములో విజయవాడ నుండి హైదరాబాదుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదం నుంచి పూర్తిగా ఎన్నటికి కోలుకో లేకపోయారు. 1972 మే 7 వ తేదీ రాత్రి 10:30 గంటల ప్రాంతములో ఢిల్లీలో గుండె పోటుతో మరణించారు. ఆయన స్మారకార్థం పాటిగడ్డ సమీపమున ఒక ఉద్యానవనమును పెంచి ఆయన పేరు మీదుగా సంజీవయ్య పార్కు అని పేరు పెట్టారు. 2008 లో విశాఖపట్నంలో స్థాపితమైన ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీకి ఆయన జ్ఞాపకార్థం 2012 లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అని పేరుమార్చారు.

# ఆప్ భవిష్యత్ కార్యాచరణ భేటీ!

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం కూలిపోవడంతో ఆ పార్టీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం పంజాబ్‌లో ప్రభుత్వ మనుగడపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓటమినుండి కోలుకోకముందే హడావుడిగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఢిల్లీలో పంజాబ్ పార్టీ ఎంఎల్ఎల సమావేశం ఏర్పాటు చేయడం గమనిస్తే ఆయనలో కంగారు కనిపిస్తుంది. ఈ సందర్భంగా పలు ఊహాగానాలు కూడా వెలువడుతున్నాయి. బిజెపి సైతం తమ తర్వాతి లక్ష్యం పశ్చిమ బెంగాల్, పంజాబ్ అని చెప్పడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లో అయితే వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగవలసి ఉండడంతో ఆ రాష్ట్రంపై దృష్టి సారించడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ మరో రెండేళ్ల పదవీకాలం ఉన్న పంజాబ్ ప్రభుత్వంపై దృష్టి సారించడం అంటే ప్రభుత్వాన్ని అస్థిరం కావించే ప్రయత్నం చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ సందర్భంగా పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా చేస్తున్న ప్రకటనలు గందరగోళం కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ బిజెపికి తదుపరి 'ఏక్‌నాథ్ షిండే' అని చెప్పడం ద్వారా ముఖ్యమంత్రి ద్వారానే ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేస్తారా? అనే అనుమానం కలుగుతుంది. మరోవంక, ఆయనే 30 మంది ఆప్ ఎంఎల్ఎలు కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని అంటూ కలకలం రేపారు. అయితే, ఆయన ప్రకటనలను మాన్ ఖండించారు అనుకోండి. ఇట్లా ఉండగా, మాన్‌ను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించేందుకు స్వయంగా కేజ్రీవాల్ నిర్ణయించుకున్నారని అంటూ ఢిల్లీలో ఎంఎల్ఎ గా ఎన్నికైన బిజెపి నేత మంజీందర్ సింగ్ సిర్సా ఆరోపణలు చేశారు. తానే పంజాబ్ ముఖ్యమంత్రి కావాలని కేజ్రీవాల్ చూస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఏదేమైనా ఢిల్లీ ప్రభుత్వం కోల్పోవడంతో కేజ్రీవాల్ ఇక ఎక్కువగా పంజాబ్ ప్రభుత్వంపై దృష్టి సారిస్తారన్నది మాత్రం యదార్థం.

దానితో అక్కడి ప్రభుత్వం ఆయన కనుసన్నలలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఆప్ రాజకీయ కార్యకలాపాలకు అవసరమైన వనరులను సమకూర్చాల్సిన బాధ్యత కూడా మొత్తంగా పంజాబ్ ఆప్‌పై పడుతుంది. పైగా, పుష్కర కాలంగా ఆప్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన 'ఢిల్లీ మోడల్' తాజా ఎన్నికల్లో విఫలమైంది. ఆ పేరుతో ఓట్లు రాబట్టడం ఇంకేమాత్రం సాధ్యం కాదని వెల్లడైంది. పంజాబ్‌లో సైతం 'ఢిల్లీ మోడల్' పేరుతో అధికారంలోకి వచ్చారు. అందుకనే పంజాబ్‌లో తమ ఎత్తుగడలను మార్చుకొనని పక్షంలో 2027లో జరిగే ఎన్నికలలో నెగ్గుకు రావడం సాధ్యం కాదు. దానితో ప్రభుత్వ ప్రాధాన్యతలను పూర్తిగా మార్చుకోవలసి ఉంది. అయితే మహారాష్ట్రలో మాదిరిగా మరో ఏక్‌నాథ్ షిండే ద్వారా పంజాబ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయడం బిజెపికి సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే ఇక్కడ బిజెపికి ఇద్దరు మాత్రమే ఎంఎల్ఎలు ఉన్నారు. ఒక్క ఎంపి కూడా లేరు. మహారాష్ట్రలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోయినా వరుసగా మూడు ఎన్నికలలో అతిపెద్ద పార్టీగా ఏర్పడింది. దానితో అక్కడ రాజకీయంగా ఆధిపత్యంలో ఉండగలిగింది. పైగా, ఆప్ తర్వాత అన్ని వర్గాలలో చెప్పుకోదగిన బలం ఉన్న పార్టీ కాంగ్రెస్ అయినప్పటికీ ఆ పార్టీలో వర్గాలకు అంతులేదు. ఒక నాయకుడంటే మరో నాయకుడికి పడదు. కొత్తగా ఆప్ నాయకులను చేర్చుకొంటే మరో కుంపటి ఏర్పాటు చేసుకున్నట్లు కాగలదు. అయితే, అరుణాచల్‌ప్రదేశ్ మోడల్‌లో పంజాబ్ ప్రభుత్వంపై బిజెపి కన్నేసే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. 2014 అరుణాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. రెండేళ్ల తర్వాత సిఎం నబమ్ తుకి తప్ప మిగతా కాంగ్రెస్ ఎంఎల్ఎలందరూ పార్టీ నుంచి విడిపోయి పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో చేరారు. ఈ ఎంఎల్ఎలలో ఎక్కువ మంది కొన్ని నెలల తర్వాత బిజెపిలో విలీనం అయ్యారు. ఆ విధంగా బిజెపి ప్రభుత్వం ఏర్పడింది. కెప్టెన్ అమరీందర్ సింగ్ పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీతో బిజెపి ఇప్పటికే విలీనమై అటువంటి ఓ ప్రయత్నం చేసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. 2022లో పంజాబ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆప్ ఇప్పటివరకు చీలికల నుండి సురక్షితంగా ఉంది. వ్యక్తిగత ఎంఎల్ఎలు కూడా పెద్దగా ఫిరాయింపులకు పాల్పడిన దాఖలాలు లేవు. ఢిల్లీలో కూడా, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొంతమంది నాయకులు బిజెపిలో చేరడం తప్ప, ఆప్ పెద్దగా చీలికలకు గురికాలేదు. 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో తిరిగి అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు ఆప్‌ను బలహీనపరచగలననే ధీమాతో ఉన్నట్లు కనిపిస్తున్నది. మరిన్ని అవినీతి కేసులతో ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అదే విధంగా పంజాబ్‌లో ఆప్‌లో చీలికలు తీసుకువచ్చే ప్రయత్నం చేయవచ్చనే ఊహాగానాలకు ఆస్కారం ఏర్పడుతుంది. అందుకే మన్ ఏక్‌నాథ్ షిండేగా మారవచ్చని బజ్వా ఆరోపించారు.

బిజెపి కూడా పంజాబ్‌లో తాను ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేకపోతున్నానని గ్రహించింది. సుదీర్ఘకాలం అకాలీదళ్‌తో పొత్తు ఏర్పర్చుకున్నప్పటికీ పట్టణ ప్రాంతాలలో కొన్ని సీట్లను మించి గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకువెళ్లలేకపోయింది. కాబట్టి రాష్ట్రంలో బలం పెంచుకునేందుకు ఇప్పుడు బిజెపికి ఏకైక మార్గం రాష్ట్రంలోని ఇతర 3 పార్టీలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ (ఆప్, కాంగ్రెస్, ఎస్ఎడి) పార్టీలలో చీలికలు తీసుకు రావడమే. అయితే, 2020–21 రైతుల నిరసన సమయంలో మాదిరిగా ఇప్పుడు పంజాబ్‌లో బిజెపి పట్ల ప్రతికూలత అంత తీవ్రంగా ఉండకపోవచ్చు గాని, చెప్పుకోదగినంతగా ఉంది. ముఖ్యంగా గ్రామీణ సిక్కు జనాభాలో ప్రతికూలత ఎక్కువగా ఉంది. అందువల్ల, ఎవరైనా బిజెపితో చేతులు కలపడానికి ఆప్ లేదా కాంగ్రెస్ లేదా ఎస్ఎడిలను విభజించినట్లయితే, కనీసం గ్రామీణ ఓటర్లలో రాజకీయంగా నష్టం వాటిల్లుతుంది. ఉదాహరణకు, పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి బలమైన అభ్యర్థి రవ్‌నీత్ బిట్టు లూధియానాలోని గ్రామీణ ప్రాంతాలలో దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సిక్కు ఓటర్లలో బిజెపి పట్ల నెలకొన్న ప్రతికూలత సైతం పంజాబ్‌లో ఆ పార్టీ విస్తరణకు అడ్డంకిగా నెలకొంది.

ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి సిక్కు అభ్యర్థులు చాలా మంది గెలిచారు. రాజౌరి గార్డెన్ నుండి మంజిందర్ సింగ్ సిర్సా, గాంధీనగర్ నుండి అరవిందర్ సింగ్ లవ్లీ, జంగ్‌పురా నుండి తర్విందర్ మార్వా వంటి వారు గెలుపొందగారు. ఆప్ సిక్కు అభ్యర్థులలో తిలక్ నగర్ నుండి జర్నల్ సింగ్, చాందిని చౌక్ నుండి పునర్దీప్ సింగ్ సాహ్నీ గెలుపొందారు. ఆప్ నుండి సురీందర్ పాల్ సింగ్ బిట్టూ, జితేందర్ సింగ్ షుంటి వరుసగా తిమార్పూర్, షాదరాలో బిజెపి చేతిలో త్రుటిలో ఓడిపోయారు. అయితే, సిక్కులలో బిజెపి ఇప్పటికీ గణనీయమైన తేడాతో వెనుకబడి ఉండవచ్చని సర్వేలు సూచిస్తున్నాయి. యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్ పోల్ ప్రకారం 69 శాతం సిక్కులు ఆప్‌కు ఓటు వేయగా, 24 శాతం మంది బిజెపికి ఓటు వేశారు. సివోటర్ సర్వే ప్రకారం 49 శాతం సిక్కులు ఆప్‌కు ఓటు వేయగా, బిజెపికి 34 శాతం మంది ఓటు వేశారు. సిర్సా, లవ్లీ, మార్వా వంటి బలమైన సిక్కు అభ్యర్థులు ఉన్న ప్రదేశాలలో ఆ వర్గం బిజెపికి మద్దతు ఇచ్చి ఉండవచ్చు, అయితే ఇతర చాలా స్థానాల్లో ఆప్ మొదటి ప్రాధాన్యతను పొందింది. ఢిల్లీ సిక్కులు పంజాబ్‌లోని వారి కంటే భిన్నమైన ఓటింగ్ సరళిని కలిగి ఉన్నప్పటికీ, జాతీయ రాజధానిలో సిక్కులలో ఆప్ ఇప్పటికీ నంబర్ వన్ ఎంపికగా ఉందన్నది వాస్తవం. రెండు సర్వేల ప్రకారం కాంగ్రెస్‌కు మద్దతు 5 శాతం కంటే తక్కువకు తగ్గింది. ఈ వాస్తవాలు పంజాబ్ లో ఆప్‌కు బలమైన ప్రాతిపదిక ఏర్పాటుకు దారితీస్తుంది.

మరోవంక, అకాలీదళ్ తీవ్రమైన నాయకత్వ సంక్షోభంలో మునిగిపోవడం సైతం ఆ పార్టీకి కలిసి వస్తుంది. మరోవంక, కేజ్రీవాల్, ముఖ్యమంత్రి మాన్‌ల మధ్య ఎన్నడూ ఎటువంటి విభేదాలు తలెత్తిన సందర్భాలు లేవు. కేజ్రీవాల్‌కు నమ్మినబంటుగా వ్యవహరిస్తున్నారు. పైగా, ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం లేకపోవడంతో మొత్తం ఆప్ పంజాబ్ ప్రభుత్వంపై ఆధారపడాల్సి ఉంటుంది. దానితో ఆప్‌లో మాన్ ప్రాధాన్యత మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇటువంటి సమయంలో ఆ ప్రభుత్వాన్ని అస్థిర పరచేందుకు ఆప్ నుండి ప్రయత్నాలు జరిగే అవకాశాలు తక్కువ. ఇంకోవైపు, కేజ్రీవాల్, ఆప్ ఢిల్లీ నాయకత్వంతో పోలిస్తే, పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ కేంద్రంతో మెరుగైన సంబంధాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వపరంగా ఎటువంటి ఘర్షణలకు దిగడం లేదు. అమృత్‌పాల్ సింగ్, అతని సంస్థ వారిస్ పంజాబ్ దేపై జరిగిన అణచివేతలో, పంజాబ్ పోలీసులు కేంద్రంతో సన్నిహిత సమన్వయంతో పని చేశారు. అమృత్‌పాల్, అతని సన్నిహితులను అసోంలోని దిబ్రుగఢ్ జైలుకు పంపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చురుకైన సమన్వయం లేకుండా జరిగేది కాదు. అయితే, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాల ఎత్తుగడలు ఇప్పుడు ఏ విధంగా ఉంటాయో అన్న విషయమై పంజాబ్ పరిణామాలు ఆధారపడి ఉండే అవకాశం ఉంది. వారు నిజంగా పంజాబ్‌లో 'ఏక్‌నాథ్ షిండే మోడల్'ను ప్రయత్నిస్తారా? అనే దానిపై చాలా ఆధారపడి ఉంటుంది. ఆప్ బలహీనపడితే, పంజాబ్‌లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యం అవుతుంది. అయితే, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ చన్నీ, ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ బజ్వా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్‌ల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరాటం ఆ పార్టీని మరింత బలహీనపరిచే అవకాశం ఉంది.

# 'ప్రేమ'కు పట్టంకట్టిన ప్రేమాభిమాని



ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన "వాలంటైన్స్ వారోత్సవాలు" ప్రతి ఏట ఫిబ్రవరి 07 నుంచి 14 వరకు నిర్వహించడంతో పాటు చివరి రోజు 14 ఫిబ్రవరిన "వాలంటైన్స్ దినం" లేదా "ప్రేమికుల దినం"గా కూడా పెద్ద ఎత్తున పాటించడం నేటి డిజిటల్ యువతకు అలవాటుగా మారింది. "ప్రేమ", "ఆప్యాయత"లే అమూల్య ఇంధనాలుగా ప్రపంచ మానవాళి శాంతియుతంగా గడుపుతున్నది. శిశువుకు తొలి "ప్రేమ"ను పరిచయం చేస్తుంది అమ్మ. చిరునవ్వుల శిశువు నాన్న "ఆప్యాయత"ను రుచి చూస్తుంది. అమ్మనాన్నలతో ప్రారంభమైన "ప్రేమానురాగాలు", అనంత "ఆప్యాయత"లు క్రమంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వరకు విస్తరించి జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. ప్రేమ నిండిన హృదయాల్లో ద్వేషానికి తావు లేదు. ప్రేమానురాగాల రుచి చూడలేని అభాగ్యుల జీవితాలు గాఢాంధకారంలోనే ముగుస్తాయి. మానవ సంబంధాలతో మొదలైన "ప్రేమలు" చెట్లు, పువ్వులు, పెంపుడు జంతువులు, ఆట వస్తువులు, పుస్తకాలు లాంటి వాటి వరకు విస్తరించి వ్యక్తి జీవితంలో రంగుల సింగడిలను రుచి చూపిస్తాయి. కౌమార దశలో అబ్బాయికి అమ్మాయిని చూసినా, అమ్మాయి అబ్బాయిని చూసినా ఏదో తెలియని వ్యతిరేక ధృవాల ఆకర్షణ ప్రేమ పేరుతో ప్రారంభమవుతుంది. రోమన్ కాథలిక్ చర్చ్‌కు చెందిన సేయింట్ వాలంటైన్ చొరవతో యువ ప్రేమికులను ఏకం చేయడం, ప్రేమకు పట్టాభిషేకం చేయడాని తన ప్రాణాలను సహితం అర్పించడం జరిగింది. ఈ రోజున యువ జంట ఒకరినొకరు మనసు విప్పి తమ ప్రేమానురాగాలను, అప్యాయతలనుధైర్యంగా వ్యక్తం చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తారు. రోమన్ యువ సైనికులు పెళ్లిళ్లు చేసుకోవడాన్ని నిషేధించారు నాటి రోమన్ చక్రవర్తి క్లాడియస్–2. చక్రవర్తి విధించినా వివాహ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ ప్రేమకు పట్టం కట్టడానికి పూనుకొన్న సేయింట్ వాలంటైన్ ఆ యువ జంటలను ఏకం చేస్తూ పెళ్లి పీటల వరకు తీసుకురావడం జరిగింది. తన నిషేధాజ్ఞలకు విరుద్ధంగా యువ సైనికులకు వివాహాలు చేసిన సేయింట్ వాలంటీన్‌కు క్రీ. శ. 14 ఫిబ్రవరి 269న మరణ శిక్ష విధించడంతో సేయింట్ వాలంటీన్ అమరత్వం పొందారు. తన ప్రాణాలకు తెగించి ప్రేమికులను ఏకం చేయడానికి కృషి చేసిన సేయింట్ వాలంటీన్ వర్ధంతి 14 ఫిబ్రవరి రోజున "వాలంటీన్స్ లేదా ప్రేమికుల దినం" నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. భారతీయ సంస్కృతిలో ఇలాంటి పాశ్చాత్య పోకడలకు ఆదరణ తక్కువ. పాశ్చాత్య దేశాల యువతలో తల్లితండ్రులకు తెలియకుండా ఇలాంటి ప్రేమలు వ్యక్తం చేసుకోవడం ప్రేమికులకు సర్వసాధారణం. కొన్ని సందర్భాల్లో యువ ప్రేమికుల జంట కొంత సమయం ఉభయుల అంగీకారంతో తర్వాత విడిపోవడం కూడా సులభంగా జరుగుతుంది. సనాతన భారతంలో ప్రేమించుకున్న యువతీయువకులు రోడ్లు, పార్కులు, పబ్బుల్లో తమ ప్రేమలను వ్యక్తం చేసుకోకుండా ఒక పద్ధతిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహాలు నిశ్చయం చేసుకొని మంగళ సూత్రాల మూడు ముళ్లు పడిన అనంతరం మాత్రమే ఆలింగనాలు, ముద్దుల వర్షాలు లాంటి శారీరక స్పర్శలకు అనుమతి ఇవ్వబడుతుంది. అయినప్పటికీ నేటి ఆధునిక డిజిటల్ భారతీయ యువత ప్రేమకు, కామానికి తేడా తెలియకుండానే క్షణాల్లో ప్రేమించుకోవడం, ఆలింగన ముద్దుల హద్దులు దాటడం, అన్ని రకాల శారీరక సుఖాలను అనుభవించడం, అటు పిమ్మట వాయు వేగంగా విడిపోవడం కూడా చూస్తున్నాం. తల్లితండ్రులు కుదిర్చిన అరేంజ్డ్ మ్యారేజీలు కాని ప్రేమ వివాహాలు కాని ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే యువ ప్రేమికుల జంట వివాహ బంధంతో ఏకం కావాలని, తమ వైవాహిక జీవితాన్ని కడదాక ఆసాంతం ఆస్వాదించాలని, ఆదర్శ జంటగా ఆనంద హరివిల్లుల కుటుంబ జీవనం గడపాలని కోరుకుందాం. కామ ఆకర్షణకు, అంతరంగిక ప్రేమకు తేడాను అర్థం చేసుకొని సన్మార్గంలో తమ జీవితాలను కొనసాగించాలని మార్గనిర్దేశనం చేద్దాం. మూడుముళ్ల బంధాలు మూడు రోజుల్లో విడిపోకుండా, విడాకులే కానరాని యువ భారతాన్ని కనులారా చూసి తరిద్దాం.

# పద్మశ్రీ మంద కృష్ణతో అంతర్గత రిజర్వేషన్లు అమలు పై ప్రత్యేక చర్చలు జరిపిన మంజునాథ్



హైద్రాబాద్ జై భీమ్ న్యూస్ : గురువారం రోజు హైదరాబాద్‌లో మంద కృష్ణ అన్నను కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు హూడి హెచ్.వీ మంజునాథ్ ప్రత్యేకంగా కలిశారు. కర్ణాటక రాష్ట్రంలో అంతర్గత రిజర్వేషన్లు అమలు చేసే అంశంపై వారితో చర్చించారు.

## పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు గురువారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యాలత అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల జాబితా పై ఏవైన అభ్యంతరాలు ఉన్నట్లయితే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చన్నారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 631 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3,72,646 మంది ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 181722 ఉన్నారని, మహిళా ఓటర్లు 190872 మంది, ఇతరులు 2 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఇవి శ్రీనివాస్ రావు, నేహాల్, బిఆర్ఎస్ నుండి ప్రవీణ్ కుమార్, బిజెపి నుండి నిశాంత్, వైసిపి నుండి రజినికాంత్, టిడిపి నుండి లక్ష్మణ్, తదితరులతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పై నోడల్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ మెటీరియల్ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్కు రెండు బాక్స్లను సిద్ధం చేయాలి. ప్రతి రూట్ కు రెండు బస్సులను ఉండే విధంగా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, సీసీ టీవీలు తదితర సౌకర్యాలను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేసే విధంగా నోడల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ర్యాలీలను, సభలను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ, నోడల్ అధికారుల విధులు, బాధ్యతలు, ఎన్నికల సంబంధించిన ఇతర అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి నోడల్ అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఇతర నోడల్ అధికారులతో పాటు తహసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వల్లభనేని వంశీ

**విజయవాడ,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు విజయవాడ తీసుకొచ్చారు. గురువారం ఉదయం హైదరాబాద్‌లోని రాయదుర్గంలో ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తొలుత విజయవాడలోని భవానీపురం పీఎస్‌కు పోలీసులు తీసుకొచ్చారు. ఆ తర్వాత మరో వాహనంలో అక్కడి నుంచి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు నందిగామ వద్ద వంశీ భార్యను పోలీసులు అడ్డుకుని ఆమె వద్ద ఉన్న మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వంశీ భార్యను ఎస్కార్ట్‌తో తిరిగి హైదరాబాద్‌కు పంపించారు. వల్లభనేని వంశీ అరెస్ట్ నేపథ్యంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీసు 30 చట్టం అమల్లో ఉన్నట్లు జిల్లా ఎస్పీ గంగాధర్ తెలిపారు. ర్యాలీలు, సభల నిర్వహణతో పాటు ప్రజలు గుమిగూడటం నిషేధమని చెప్పారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆస్తి పంపకాలు తేలాకే అంత్యక్రియలు?

మూడు రోజులుగా ఇంటిముందు తండ్రి మృతదేహం
జాలి లేని కొడుకు కూతురు



**జనగాం జిల్లా జై భీమ్ న్యూస్**

ఆస్తి కోసం తండ్రి అంత్య క్రియలను ఆపాడు ఓ కొడుకు. ఈ ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో చోటుచేసుకుంది. ఆస్తి విషయం తేలే వరకు తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు చేసేది లేదంటూ పట్టుబట్టాడు. దీంతో చేసేది లేక మూడు రోజులుగా ఇంటి ముందే డెడ్ బాడీని అంత్యక్రియలు జరగకుండా ఉంచారు. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం... వెలికట్టె యాదగిరి (55)కి ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు కొడుకు రమేశ్ ఉండగా రెండో భార్య పద్మకు కొడుకు ఉపేందర్, కూతురు శోభారాణి ఉన్నారు. అయితే రెండో భార్య పద్మ కొడుకు ఉపేందర్ అనారోగ్యంతో గతంలోనే చనిపోయాడు. యాదగిరికి గ్రామంలో 15 ఎకరాల భూమి ఉండగా ఐదు ఎకరాలను రమేశ్ పేరున రిజిస్ట్రేషన్ చేసి, రెండు ఎకరాలను కట్నం కింద కూతురు శోభారాణి రాసి ఇచ్చాడు. మూడు రోజులుగా డెడ్ బాడీ ఇంటి ముందే మరో మూడు ఎకరాలు అమ్మిబంగారం పెట్టారు. మిగతా ఐదు ఎకరాలను రెండో భార్య పద్మ పేరిట రాశారు. అయితే పద్మ తన పేరున ఉన్న భూమిలో మూడు ఎకరాలను అమ్మితన కూతురు శోభకు హైదరాబాద్ ఇల్లు కొనిచ్చింది. ఇదిలా ఉండగా యాదగిరి అనారోగ్యంతో 2025 ఫిబ్రవరి 10వ తేదీన చనిపోయాడు. దీంతో తన చిన్నమ్మ పద్మ పేరున ఉన్న మిగిలిన రెండు ఎకరాల విషయం తేల్చిన తర్వాత తండ్రికి అంత్య క్రియలు చేసేది లేదని కొడుకు రమేశ్ పట్టుబట్టాడు. గ్రామస్తులు కూడా రమేశ్ కే మద్దతు పలకడంతో మూడు రోజులుగా యాదగిరి డెడ్ బాడీ ఇంటి ముందే ఉంది. చివరకు గ్రామస్తులు బుధవారం పద్మ, శోభతో మాట్లాడి వివాదాన్ని సెటిల్ చేశారు. దీంతో గురువారం ఎట్టకేలకు యాదగిరి అంత్యక్రియలు జరపనున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ సత్యశారధ

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో డిఆర్ ఓ విజయలక్ష్మితో జలసి విద్యాశాఖ అధికారులతో పీఎం శ్రీ, సర్వ శిక్ష అభియాన్ పథకాల కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి , మరమ్మత్తు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలల అభివృద్ధి నిమిత్తం కోటి 38 లక్షల రూపాయల వ్యయంతో మంజూరైన 14 పనులు వివిధ పురోగ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా సర్వ శిక్షణ అభియాన్ పథకం కింద 3 కోట్ల రూపాయల వ్యయంతో 12 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ లాబరేటరీల ఏర్పాటుకు కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ బైక్‌పై వెళ్లినందుకు దళిత విద్యార్థి చేయి నరికినా దారుణ ఘటన



**జై భీమ్ న్యూస్ చెన్నయ్ :**

తమిళనాడులోని శివగంగై జిల్లా మేళపిడవూర్ గ్రామంలో రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్‌పై వచ్చినందుకు అగ్రవర్ణాలకు చెందిన ముగ్గురు అగంతకులు దళిత విద్యార్థిపై దారుణంగా దాడి చేసి చేతులు నరికిన దారుణ ఘటన చోటు చేసుకుంది. అయ్యసామి బాధిత విద్యార్థి. అతడు ప్రభుత్వ కళాశాల విద్యార్థి. ఈ దాడిలో అయ్యసామి రెండు చేతులకు తీవ్ర గాయాలు కావడంతో మదురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులు ఆర్‌వినోత్‌కుమార్ (21), ఏతీశ్వరన్ (22), ఎం వల్లరసు (21)లను అరెస్టు చేశారు. బంధువు మునియసామి స్పందిస్తూ.. 'అధునాతన బైక్‌లు దళితులు నడపరాదంటూ వినోత్‌కుమార్, ఏతీశ్వరన్, ఎం వల్లరసు అయ్యస్వామిపై కుల దూషణలతో దాడి చేశారు. ఘటనా స్థలం నుంచి పారిపోయి ఇంట్లో చేరి ఉండకపోతే అయ్యసామిని హత్య చేసి ఉండేవారు. మేము అతన్ని ఆసుపత్రిలో చేర్చిన తర్వాత కూడా, గుంపు అతని ఇంట్లోకి చొరబడింది. గ్రామంలో చాలా కాలంగా కుల వివక్ష కొనసాగుతోందని, కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో నా కొడుకు బుల్లెట్ బైక్ నడపడం ఉన్నత వర్గాల హిందువులకు సౌకర్యంగా లేదని అయ్యసామి తండ్రి భూమినాథన్ వ్యాఖ్యానించారు. గతంలో కూడా బైక్‌ను పాడు చేశానని చెప్పాడు. బుధవారం సాయంత్రం అయ్యసామి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆర్.వినోత్‌కుమార్, ఎ.అతీశ్వరన్, ఎం.వల్లరసు పదునైన ఆయుధాలతో దాడి చేశారు. దాడికి 'బుల్లెట్' సమస్య ప్రాథమిక కారణం కాదు. నిందితుల్లో ఒకరైన అతీశ్వరావును అయ్యసామి ఎగతాళి చేశాడు. దీంతో వారి మధ్య గతంలో గొడవలు జరిగాయి. అయితే తదుపరి విచారణ కొనసాగుతోంది. నిందితులపై భారతీయ శిక్షాస్మృతిలోని 296 (1), 126 (2), 118 (1), 351 (3) మరియు ఎస్సీ ఎస్టీ చట్టంలోని 3 (1) (ఆర్)(లు) సెక్షన్ల కింద వినోద్ కుమార్, అతీశ్వరన్, వల్లరసులపై కేసు నమోదు చేసి, నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

## గంజాయి పట్టివేత

**ఐనవోలు: (జై భీమ్ న్యూస్)**

200గ్రాముల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఐనవోలు పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వనమాలకనపర్తి గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఉండి పోలీసులని చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి ఎస్సై,సిబ్బంది పట్టుకుని వారిని విచారించగా 200 గ్రాముల ఎండు గంజాయి దొరికింది, గంజాయి విలువ సుమారుగా 5000 వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# జై కేసారంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం



**చౌటుప్పల్ (జై భీమ్ న్యూస్)**

జైకేసారం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఉద్దేశ అనుసారం పార్టీ గ్రామ శాఖ కన్వీనర్ గా సమిరెడ్డి జనార్దన్ రెడ్డి ని నియమించడం జరిగింది కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస పాలనతో విసిగిపోయి కాంగ్రెస్ పార్టీ నుంచి గుత్త బాల్ రెడ్డి గారు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరడం జరిగింది.. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి గారు మండలపార్టీ ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు కురుమ మెట్టు మహేష్ రెడ్డి ప్రధాన కార్యదర్శిఆల్మాస్ పేట కృష్ణ సీనియర్ నాయకులు కోర్పురి లింగయ్య డైరెక్టర్ దొడ్డి శ్రీశైలంగారు బోదాసు వెంకటయ్య నీల శేఖర్ గంగదేవి రమేష్ లింగస్వామి శంకర్ యువజన విభాగం అధ్యక్షులు కట్ట రంగనాథ్ కోర్పూరి గణేష్ దొడ్డి గణేష్ సందీప్ ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ నూతన ప్రిన్సిపల్‌గా ఆచార్య మనోహర్

**ప్రిన్సిపాల్ కార్యాలయ పరిపాలనకు కృషి చేస్తా**
**యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య తాళ్ళపల్లి మనోహర్**






**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్**

కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపల్ గా నూతనంగా నియామకమైన సోషల్ సైన్స్ డీన్ చరిత్ర విభాగ సీనియర్ ఆచార్యులు తాళ్లపల్లి మనోహర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ లాల్ నూతన ప్రిన్సిపల్ ఆచార్య మనోహర్ కి భాద్యతలు అప్పగించారు.భాధ్యతలు స్వీకరించిన ఆచార్య మనోహర్ కు కాకతీయ విశ్వవిద్యాలయంలోని అన్ని వర్గాలు ఘనంగా స్వాగతిస్తూ అభినందనలు తెలియజేశారు. ప్రధానంగా ఆచార్య అధ్యాపకులు ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు అన్ని వర్గాలకు చెందిన వారు మొదటి రోజు ప్రిన్సిపాల్ కార్యాలయం చుట్టూ గుంపులుగా చేరి ఆచార్య మనోహర్ పై వాళ్లకున్న అభిమానాన్ని వెళ్లబుచ్చారు. గతంలో పలు పదవులను అధిరోహించిన ఆచార్య మనోహర్ కు ప్రిన్సిపాల్ పరిపాలన పదవులలో అత్యంత అనుభావం కలదని సహజసిద్ధమైన పరిపాలన చేయడంలో తన ప్రత్యేకతను నిరూపించగలరని విశ్వవిద్యాలయ మేధావులు అభిప్రాయపడుతున్నారు. తనపై విశ్వాసంతో, నమ్మకముతో విశ్వవిద్యాలయ అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా కళాశాల ప్రిన్సిపల్ గా నియమించిన వీసి ఆచార్య ప్రతాపరెడ్డికి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు నూతనంగా నిమకమైన ఆచార్య టి.మనోహర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**కామారెడ్డి,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్) :**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కామారెడ్డి ఎఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ఏరియాలను ఎస్పీ పరిశీలించారు. గతేడాది కాలంగా ఎక్కువగా యాక్సిడెంట్లు జరిగిన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాసంపల్లి, టెకిర్యాల్ శివార్లను ఆమె పరిశీలించారు. స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయడం,హెచ్చరిక బోర్డుల ఏర్పాటు అంశాలపై సూచనలు చేశారు. రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి ఎస్సై రాజు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యశారద

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లాలోని ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజ్, వర్ధన్నపేట ప్రభుత్వాసుపత్రుల పనితీరు, సాధించిన లక్ష్యాలు, అవసరాలపై కలెక్టర్ కూలంకషంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం, టి డయాగ్నస్టిక్ హబ్, ఎంఎల్ హెచ్ పి పనితీరు వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించి వైద్య అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసావాలు జరిగేలా పర్యవేక్షణ జరగాలని, ప్రసావానికి దగ్గరగా ఉన్న గర్భిణులను రెగ్యులర్గా మానిటరింగ్ చేయాలన్నారు. రెగ్యులర్గా చెకప్ సకాలంలో జరగాలని, ఏఎంసి రిజిస్ట్రేషన్ 100% కావాలన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన వారికి మందులు అందుబాటులో ఉంచి, రోగులకు అందేలా చూడాలని తెలిపారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ప్రస్తుతం ఫలితాలు ఆలస్యంగా అందుతున్నాయని, వీటిని తగ్గించి త్వరితంగా (ఫలితాల) రిపోర్ట్ ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షా నమూనాలు టి హబ్ ద్వారా త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గుర్తించి, లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను



ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో పేషంట్ల హక్కులు, కర్తవ్యం వివరాలు తెలిపే బోర్డును ప్రదర్శించాలన్నారు. సికేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని, సివిల్ వర్క్స్ చేయుటకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. పేషేంట్ల సౌకర్యార్థం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఆప్తోమిక్ సర్జన్ ను డెప్యూటషన్ ప్రాతిపదికన నియమించుటకు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆన్లైన్లో తరగతులు నిర్వహించబడుతున్నాయని, ఆఫ్లైన్లో తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రిలో శవ పరీక్షల కేంద్ర మరమ్మత్తులు ఏర్పాట్లపై సమీక్షించి అందులో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో వెంటనే ఆటో జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్ లు కిషోర్, నరసింహస్వామి, భరత్ కుమార్, పద్మావతి రామమూర్తి, ఆరంబోలు శ్రీనివాస్ సత్యజిత్ రే, వైద్యాధికారులు రాజు, లతా తదితరులు పాల్గొన్నారు.

# దాస్ సేవా సమితి ఆధ్వర్యంలో మైక్ సెట్ ప్రింటర్ బహుకరణ

**చౌటుప్పల్ (జై భీమ్ న్యూస్)**

చౌటుప్పల్ మండలంలో దాస్ సేవా సమితి ఆధ్వర్యంలో దాదాపు 16 ఉన్నత పాఠశాలలో మైక్ సెట్ మరియు ప్రింటర్ ఇవ్వటం జరిగింది. ఒక చౌటుప్పల్ మండలం కాకుండా చిట్యాల, పోచంపల్లి మరియు నారాయణపూర్ మండలాల్లోని పాఠశాలలకు కూడా ఈ దాస్ సేవా సంస్థ సౌజన్యంతో సుమారు పది లక్షల రూపాయల విలువైన వస్తువులు బహుకరించారు. దీనికి మొత్తం ప్రేరణ కల్పించిన వ్యక్తి నర్సింగ్ రావు సార్ గారు తూప్రాన్ పేట ప్రధానోపాధ్యాయులు మండలములో ఉన్నటువంటి అన్ని పాఠశాలకు మౌలిక వసతుల్లో భాగంగా ఇవి కల్పించడం జరిగింది. మరియు చౌటుప్పల్ మండల విద్యాశాఖ అధికారి గురువారావు దాసు సేవా సంస్థ వారికి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేసారు. పర్యవేక్షకులు నరేష్, సాయికుమార్ మా దాస్ సేవా సమితి యొక్క ఉద్దేశ్యం ప్రధానంగా పేద విద్యార్థులకు కూడా తక్కువ కాకుండా అన్ని వసతులు సమకూరాలని, వాళ్ళ చదువులో ఉన్నత స్థాయిలకు రాణించాలని ఆశయంతో ఇటువంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలియచేయడం జరిగింది. దాస్ సేవా సమితి, హైదరాబాద్ వారు మన మండలంలోని 25




పాఠశాలల వరకు17 అహూజా మైక్ సెట్లు మరియు లేజర్ ప్రింటర్స్ ఇచ్చారు. ఈ దాస్ సేవాసమితి వారు గతంలో కూడా మా తూప్రాన్ పేటకు చాలా సాయం చేశారు టాయిలెట్స్ కట్టించారు ఫర్నిచర్ ఇచ్చారు అని నరసింహరావు తెలిపారు. ఈ విషయం గురించి దాస్ సేవా సంస్థ వారిని లింగోజిగూడెం జెడ్పిఎచ్ఎస్ తెలుగు పండిట్ బండి అనిల్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమం లో ఎంఈవో ఈ గురువారావు ఎంఎన్వో నరసింహం రావు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు

**అసెంబ్లీలో అందుకు అనుగుణంగా బిల్లులు పెట్టాలి**
**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్**

**జనగామ,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

మోసాలు చేయడంలో ఆరితేరిన గుణం కాంగ్రెస్ పార్టీదని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అదో దాఖాబాజ్ పార్టీ అని అన్నారు. జనగామ జిల్లా పర్యటనలో బీసీ బిల్లుపై కవిత స్పందించారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు తేవాలని.. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవాలన్నారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేను ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు.కానీ, జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లుగా నిర్దిష్టమైన సమాచారం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని.. ఇదే బీసీలందరి తొలి విజయమన్నారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 60శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని.. రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

## వంశీ ఓ విధ్వంసకారుడు

**మచిలీపట్నం,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఓ విధ్వంసకారుడని ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. వల్లభనేని వంశీ అరెస్ట్‌పై ఆయన స్పందించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో కొనకళ్ల నారాయణరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ దాడి చేయించి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. అనేక మంది టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి వేధించారని అన్నారు. టీడీపీ కార్యాలయంపై ఆయనే దాడి చేయించి టీడీపీ నేతలను అరెస్ట్ చేయించారని చెప్పారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ మహిళా నేతలను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. గన్నవరంలో వంశీ అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పుకొచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కొన్ని వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. వల్లభనేని వంశీపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించాడని ధ్వజమెత్తారు. సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఒక నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరో నేరానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్పడ్డారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ విశాఖలో చెప్పారు.వంశీ గత చరిత్ర అంతా నేర మయమని ఆరోపించారు. జగన్ గ్యాంగ్‌లో చేరి అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దళిత యువకుడు సత్యవర్ధన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ అరెస్టు జరిగిందన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రణవ్ గోపాల్ చెప్పారు. వల్లభనేని వంశీ లాంటి వారిని వేటాడే ఆట మొదలైందని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం తెలిపారు. వంశీ , దేవినేని అవినాష్ , కొడాలి నాని చీడపురుగులు అని విమర్శించారు. కన్నతల్లి లాంటి పార్టీ కార్యాలయంపై దుర్మార్గులు దాడి చేశారని మండిపడ్డారు.

# గూగుల్ సంస్థ ఒప్పందం

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ తో ఒప్పందం చేసుకుంది. ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలను విస్తృతం చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం గూగుల్ సంస్థ అందించనుంది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గూగుల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, గూగుల్ ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. రైతులకు అవసరమైన ఇన్పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ ను ప్రారంభిస్తుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్ ను అందిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "ఏఐ ఆధారిత రంగాల్లో గ్లోబల్ లీడర్ గా ఉండాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు గూగుల్ సహకారం ఎంతగానే ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది" అని అన్నారు. గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని అన్నారు.




# పాలకులు మారకపోతే ప్రజలు మారుతారా.?

మొదటి పేజీ తరువాయి

పెట్టుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా 90 శాతం నాయకులు నిజాయితీకి ఆమడ దూరాన ప్రజల్ని పాలిస్తుండడం ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత పెరిగిపోతుందన్నారు. ప్రతి రాష్ట్రంలో ఎక్కడో ఒక కాడ ఒకరిద్దరూ సమర్థవంతమైన నాయకులు ప్రజల కోసం పాటుపడుతుండగా ప్రజాసేవను అభివృద్ధి పరచాల్సిన అధికారులు పాలకుల అసమర్థతను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ విలువలను దిగజార్చడమే కాకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించుటలో ఆరితేరిపోతున్నారన్నారు. ప్రధానంగా ఏ రాష్ట్రంలో చూసిన అవసరాలకు మించి ప్రజలకు ఉచితాలు కల్పించడం నేరంగా భావించే పరిస్థితులు ప్రభుత్వాలు పాలకులు, పరిపాలన విధానాలను కింది స్థాయికి దిగజారుస్తూ పలుచనవుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రజాసేవకు అత్యంత అడ్డంకులు సృష్టిస్తున్న రెవెన్యూ శాఖలో పెను మార్పులు సంభవించకపోతే ప్రజలు పాలకుల చేతుల్లో హరిగోశ పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఏర్పడుతుందన్నారు. చట్ట పరిధిలో పోలీసు వ్యవస్థకు ఎంతో గౌరవం ఉండేదని అలాంటి పోలీసు వ్యవస్థ ఉన్నత స్థాయి విలువలను దిగజార్చుకుంటూ కొంత శాతం పోలీసులు వ్యక్తిగతాన్ని ప్రదర్శిస్తూ నాయకుల మెప్పుకోసం అహర్నిశలు అరటపడుతున్నారన్నారు. పాలకుల చేతిలోని ఉత్తరాలతో ఉన్నత అధికారులు పోస్టింగులు తీసుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రజాస్వామ్య వ్యతిరేకతకు అద్దం పట్టిన అంశంగా భావిస్తున్నామన్నారు. పాలకులు ప్రజల వైపా అధికారుల వైపా తేల్చుకోలేని దుస్థితిలో దేశం కొట్టుమిట్టాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధివిధానాలలో ఎక్కడ చూసినా ప్రజా వ్యతిరేక విధానాలనే అవలంబిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలన్నిటిని ప్రైవేటు పరం చేయడం పాలకులకు తగునా అంటూ సూటిగా స్పష్టంగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య ఎన్నికలలో ఎన్నికల నియమావళికి మించి ఆర్థిక వ్యయాన్ని ఖర్చుచేస్తున్న ప్రభుత్వాలకు, పాలకులకు ఆయా పార్టీల నాయకులకు, ఆర్థిక లావాదేవీలలో ఎన్నికల ఖర్చులు అత్యధికంగా పెట్టామని గెలిచిన తదుపరి అక్రమ సంపాదనకు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండడం ప్రజలకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. పాలకులలో రావాల్సిన మార్పు ప్రజలకు ప్రభుత్వాలపై నమ్మకం కల్పిస్తుందన్నారు. రానున్న కాలంలో కేంద్రం అన్ని రాష్ట్రాల విద్యా వ్యవస్థలను ఆగం చేసే కుట్రలు పన్నుతుందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోవడానికి ప్రధాన కారణం నాయకుల అణిచివేతనన్నారు. ఓట్ల విషయంలో చూపిన క్రమశిక్షణ పరిపాలన విషయంలో పాలకులు చూపెట్టకపోతుండడం దేశ రక్షణకు ప్రమాదం అన్నారు. ఓట్లు అడిగే హక్కు నిజాయితీగల పాలకులకు మాత్రమే ఉండే విధంగా చట్టాలు సవరించబడాలన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా వ్యతిరేకత పాలకుల తీరు పట్ల ప్రజలు ఉద్యమకారులు పోరాటాలు చేసి అలసిపోయారన్నారు.నేరుగా న్యాయస్థానాలు రంగంలోకి దిగి ప్రజా వ్యతిరేక పాలకులను కట్టడి చేయాలని కోరినారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చూసిన ఆర్థిక లావాదేవీలు ఆర్థిక స్థితిగతులపై లెక్కలేనాన్ని కేసులు న్యాయస్థానాల వైపు వెళ్లడానికి పాలకుల అసమర్థతే కారణమని పేర్కొన్నారు.ప్రజలను ప్రభుత్వ పరిధిలో అత్యంత పనిముట్లుగా తయారుచేసి ప్రభుత్వాల పరిధిలో జీవన ఉపాధి కల్పించబడే విధంగా విద్య ఉద్యోగ వైద్యం నివాసం అభివృద్ధి చెందే విధంగా పాలకుల పాలనలో మార్పు రాగలిగితే ప్రజలలో కూడా ఊహించని మార్పు అనుకోని విధంగా సంభవిస్తుందన్నారు. పాలకులు రాజకీయ అవసరాలకు అలవాటు పడి ప్రజలను మోసగిస్తామంటే ఎక్కువ కాలం ప్రభుత్వాలు నిలబడమన్నారు. పాలకులు బలపడుతూ ప్రభుత్వాలను బలపరుస్తూ ప్రజలను మోసం చేస్తుండడం న్యాయస్థానాలు గమనించాలన్నారు. దేశవ్యాప్తంగా పాలకులను కట్టడి చేయడంలో ఉన్నతాధికారుల వల్ల కూడా కాకపోతుండడం సర్వసాధారణమన్నారు.అందుకే న్యాయస్థానాలు సామాన్య ప్రజలకు అండగా నిలవడానికి రక్షణ కల్పించబడడానికి పాలకులకు కఠినమైన ఆంక్షలు విధించబడే విధంగా ప్రభుత్వాలను ఆయత్తరచాలన్నారు.ఉచిత పథకాలకు ప్రజలను అలవాటు పరుస్తున్న ప్రభుత్వాలు అన్ని రాష్ట్రాలలో అప్పుల కుప్పలను తయారు చేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రజలకు కావలసిన నిత్యవసరాల సౌకర్యాలను మాత్రమే కల్పించి అత్యధికంగా ప్రజలు పని సౌకర్యాలకు అలవాటు పడే విధంగా ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేసి అమలుపరచాలన్నారు.తెలుగు రాష్ట్రాలలో ఆర్థిక సంక్షోభం సృష్టించబడుతున్నందున పాలకులు మొదటగా ఆర్థిక వనరులను అభివృద్ధి పరచడంలో శ్రద్ధ చూపిస్తూ ప్రజలకు అత్యంత సౌకర్యవంతమైన పాలనను అందించగలిగే విధంగా నమ్మకం కల్పించాలన్నారు.ఎక్కడ చూసినా ఆర్థిక దోపిడీ ధన దోపిడీ వ్యవస్థల దోపిడీ,భూదోపిడి అధికార దుర్వినియోగ దోపిడీ అవినీతి అక్రమాలు లెక్కలేనంతగా పెరిగిపోతుండడంతో ప్రజలలో పాలకులపై విశ్వాసం సన్నగిల్లడమే కాకుండా రాజకీయాలపై పూర్తి వ్యతిరేకత వస్తుందన్నారు.తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో ముగ్గురు ఆంధ్రాలో ఇద్దరు నాయకులు మినహా ప్రజలకు పాలకులపై పూర్తిగా నమ్మకం పోయిందన్నారు.పరిపాలన కుదుటపడుతున్న సమయంలో ప్రతిపక్షాలు అడ్డుపడుతుండడం పాలకుల వ్యతిరేకతే కారణమన్నారు.ప్రజలను అనుకున్న విధంగా పరిపాలిస్తూ ప్రభుత్వ పరిధిలో ప్రజలకు పూర్తి భద్రత, రక్షణలు కల్పించాలన్నారు.తెలుగు రాష్ట్రాలలో ఏ నియోజకవర్గంలో చూసిన ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వాల పరిధిలో కొన్ని చోట్ల సమృద్ధిగా నిధులు మంజూరు చేయబడుతున్నప్పటికీ సామాన్య ప్రజల వరకు చేరడంలో ఎక్కువ శాతం సొమ్ము తప్పుడు దారి మల్లుతుండడం పట్ల ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ప్రజల పేరు చెప్పి అభివృద్ధి మాటున అక్రమ సంపాదనకు అలవాటుపడుతున్న పాలకులను అధికారులను ఆయా ప్రభుత్వాల పెద్దలే కట్టడి చేయాలని సూచించారు. లేదంటే దినదినానికి పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు ప్రతిపక్షాల అనుమానాలకు ప్రభుత్వాలే స్వయంగా తావిచ్చినట్టు అవుతుందన్నారు. సమాజాన్ని మేలుకొలుపుతూ సమాజాన్ని ప్రభావితం చేసే కవులు మేధావులు జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమాలకు దూరంగా జీవిస్తూ అణగారిన వర్గాల కోసం ప్రయాసపడుతూ, ఆరాటపడుతూ, సమయానుకూలంగా ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు పేద ప్రజలకు చేసే మేలు ఎంత అత్యున్నత కింది స్థాయికి చేరుతుందో అప్పుడే ప్రజలకు పాలకులపై నమ్మకం కలుగుతుందన్నారు. నామమాత్రంగా పాలకులు పరిపాలించకుండా ప్రజా సంక్షేమ అభివృద్ధి కొరకు పాటుపడినట్లు ప్రజల్లో బలమైన విశ్వాసం కలిగించినప్పుడు పాలకులపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రజల్లో మార్పు సహజమని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వాలు మార్పు తధ్యమన్నారు. ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని ఏ ప్రభుత్వమైతే ఆకట్టుకుంటుందో ఆ ప్రభుత్వం ఆ పాలకులు ఆ నాయకులు ప్రజలకు మేలు చేసినవారవుతారన్నారు. ప్రధానంగా కేంద్రంలోని రాష్ట్రాలన్నీ అప్పుల భారాన్ని అధిగమించాలన్నారు. ప్రజల జీవన విధానంలో అనుకున్న మార్పులు తేగలిగిన పాలకులకు ప్రజలను పాలించే హక్కు ఉంటుందన్నారు. లేదంటే స్వయంగా నాయకులే రాజకీయాల నుండి తప్పుకోవాలన్నారు.దినదినానికి మారుతున్న పాలకుల స్వభావం ప్రజల మార్పును ఎటు దారిమళ్ళిస్తుందో వేచి చూడాలన్నారు.

# మిగులు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు

## తెలంగాణ అప్పులపై రాజ్యసభలో నిర్మల ప్రస్తావన

## తెలంగాణకు చేసిన అభివృద్ధిపై ఏకరువు పెట్టిన మంత్రి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

ఎపి విబజన సమయంలో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల కుప్పగా మారిందని రాజ్యసభలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రస్తావించారు. ఏపీ విభజన సమయంలో తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉందన్నారు. కానీ ఇప్పుడు అది అప్పుల కుప్పగా తయారైందని తెలిపారు. 'నేను ఏ పార్టీని తప్పు పట్టడం లేదు. ఇందిరాగాంధీ గెలిచిన మెదక్ నియోజకవర్గంలో తొలుత రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసింది మోడీ ప్రభుత్వమేనని అన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించింది నరేంద్ర మోడీ ప్రభుత్వమే. ఎరువుల ఉత్పత్తిలో రికార్డు స్థాయిలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచాం అని అన్నారు. నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత నరేంద్ర మోడీదే. అత్యద్భుతమైన పసుపు పండే ప్రాంతం నిజామాబాద్. తెలంగాణకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్లో పారిశ్రామిక కారిడార్ను ఏర్పాటు చేసినందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఆమె వెల్లడించారు. వరంగల్లో పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కును ఏర్పాటు చేశామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గుర్తు చేశారు. 'సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాం. బీబీనగర్ లో ఎయిమ్స్ ఏర్పాటు చేశాం. 2605 కిలోమీటర్ల జాతీయ రహదారులను వేశాం. భారత్ మాల కింద నాలుగు గ్రీన్ కారిడార్లు ఏర్పాటు చేశాం. 5337 కోట్ల రూపాయల బడ్జెట్ను రైల్వేల అభివృద్ధి కోసం తెలంగాణకు కేటాయించాం. ఏరుపాలెం నంబూరు మధ్య , మల్కాన్ గిరి పాండురంగాపురం మధ్య 753 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్ నిర్మించాం. ఐదు కొత్త వందేభారత్ ట్రైన్లను తెలంగాణకు ఇచ్చాం. 40 రైల్వే స్టేషన్స్ రీడెవలప్ చేసాం. పీఎం ఆవాస్ అర్బన్ కింద రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 31 లక్షల టాయిలెట్లను స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్మించాం. జల్జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్ల కనెక్షన్ ఇచ్చాం. 82 లక్షల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను ఇచ్చాం. 199 జనఔషది కేంద్రాలను ఏర్పాటు చేశాం.' అని నిర్మాల సీతారామన్ తెలిపారు.

# ఆర్థిక సాయం అందించిన శ్రీ మల్లికార్జున యాదవ యూత్ పరపతి సంఘం



**ఐనవోలు (జై భీమ్ న్యూస్)**

మండల కేంద్రంలోని ఇటీవల అకాల మరణంతో మృతి చెందిన కత్తుల బిక్షపతి కుటుంబానికి శ్రీ మల్లికార్జున యాదవ యూత్ పరపతి సంఘం ఆధ్వర్యంలో పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అధ్యక్షులు నల్లబెట్ట రాజు జీఎంపీఎస్ నల్లబెట్ట చిన్న రాజు యాదవ్ కత్తుల రమేష్ ఉడుత అశోకు కత్తుల రాజు ఉడుత రాజశేఖర్ నల్లబెట్ట రాజకుమార్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# చిలుకూరు పూజారిపై దాడికేసు

**పోలీసుల అదుపులో మరో ఏడుగురు**

**రంగారెడ్డి,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్) :**

మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు తూర్పు గోదావరి, భద్రాచలం జిల్లాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. దాడి జరిగిన తర్వాత పరారీలో ఉన్న నిందితులలో గురువారం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం రాఘవరెడ్డి 20మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వెళ్లి దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన తర్వాత ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. దీంతో మిగతా నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు పోలీసులు. రామ రాజ్య స్థాపనకు మద్ధతు ఇవ్వాలని రాఘవరెడ్డి 20 మంది అనుచరులతో అర్చకులు రంగరాజన్ పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు రాఘవరెడ్డి బ్యాచ్. దీనిపై చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కీలక నిందితులను అరెస్టు చేశారు. మిగత నిందితుల కోసం గాలిస్తు?న్నారు.

# నార్సింగ్ పోలీసుల కస్టడీకి మస్తాన్ సాయి

**నేరాల చిట్టా కూపీలాగనున్న పోలీసులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

నటుడు రాజ్ తరుణ్ - లావణ్య కేసులో కీలక నిందితుడు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని కోర్టు అనుమతించడంతో గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టేందుకు నార్సింగి పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నేరం, లైంగిక డాడీ, బ్లాక్ మెయిలింగ్ వంటి దురాగతాల కేసులో యూట్యూబర్ మస్తాన్ సాయి పై పలు అభియోగాలు ఉన్నాయి. రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి దగ్గర 300 మంది అమ్మాయిల వీడియోలు ఉన్నాయని, అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని లావణ్య ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారం మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, వివరాలు రాబట్టనున్నారు పోలీసులు. పలువురు అమ్మాయిలతో ప్రైవేట్ గా ఉన్న సమయంలో వీడియోలు రికార్డ్ చేసినట్లు మస్తాన్ సాయిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ గా గడిపిన వీడియోలతో మస్తాన్ సాయి బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తనకు చెందిన కొన్ని వీడియోలను మస్తాన్ సాయి రికార్డ్ చేశాడని పేర్కొన్న లావణ్య.. వీడియోలను పోలీసులకు అందజేసింది. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్ లో 300 వీడియోలకు పైగా ఉన్నట్లు గుర్తించారు పోలీసులు

# ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

**బరిలో పదిమంది అభ్యర్థులు : కలెక్టర్**

**విశాఖపట్నం,ఫిబ్రవరి13(జై భీమ్ న్యూస్):**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 10వ తేదీ వరకు 20 నామినేషన్లు వచ్చాయని, అందులో పది మంది మాత్రమే అర్హత సాధించారని విశాఖ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరింధ్ర ప్రసాద్ తెలిపారు. ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోకపోవడంతో మొత్తం పది మంది బరిలో ఉన్నట్లు చెప్పారు. 'ఈనెల 27న పోలింగ్ నిర్వహిస్తాం. మొత్తం ఓటర్లలో 13,580 మంది పురుషులు, 8,985 మంది మహిళలు ఉన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలకు ముందు ఓటర్లు స్లిప్‌లు అందిస్తున్నాం. మార్చి 3న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 11 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. ప్రతి మండలంలో ఒక టీమ్ ఉంటుంది'అని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని విశాఖ డీసీపీ అజితా వేజెండ్ల తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు.

# ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ జట్టు ఇదే..

### బుమ్రా స్థానంలో యువ బౌలర్‌కి ఛాన్స్!

ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. దీని తర్వాత ఫిబ్రవరి 23న గొప్ప మ్యాచ్ జరగనుంది. భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ జట్టుకు సంబంధించిన కీలక అప్డేట్ బయటికి వచ్చింది. దుబాయ్‌లో టీమిండియాను చాంపియన్‌గా నిలబెట్టేందుకు కృషి చేసే 15 మంది పేర్లను సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ ఖరారు చేసింది. జస్ప్రీత్ బుమ్రా ఈ మెగా ఈవెంట్‌లో భాగం కాకపోవడం భారతీయ అభిమానులకు చేదువార్త. బుమ్రా స్థానంలో హర్షిత్ రాణా జట్టులోకి వచ్చాడు. ఇదే సమయంలో యశస్వి జైస్వాల్‌కి బదులు వరుణ్ చక్రవర్తి సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చాడు. యూఏఈ గడ్డపై టైటిల్ సాధించేందుకు కెప్టెన్ రోహిత్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భారీ ఎత్తుగడ వేశారు. ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టు టైటిల్ గెలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు ఎంపిక చేసిన జట్టులో ఐదుగురు స్పిన్నర్లకు చోటు కల్పించారు. వరుణ్ చక్రవర్తి కేవలం కుల్దీప్ యాదవ్‌కు మద్దతు ఇవ్వడమే కాకుండా.. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లను కూడా జట్టులో ఉంచారు. దుబాయ్ గడ్డపై స్పిన్నర్లకు చాలా సాయం అందుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం పిచ్ స్పిన్ బౌలర్లకు సహకరిస్తే.. రోహిత్ సేనను ఢీకొట్టడం ప్రత్యర్థి జట్టుకు కష్టమైన పని అని చెప్పుకోవచ్చు. ఏమైనప్పటికీ వరుణ్‌ను చాలా మంది




బ్యాట్స్‌మెన్ ఎదుర్కోలేదు. అతను టీమ్ ఇండియా ప్రధాన ఆయుధంగా నిరూపించగలడు. ఇదే సమయంలో కుల్దీప్ సత్తా ఏంటో అందరికీ తెలిసిందే. జడేజా పిచ్ నుండి సహాయం పొందితే అతను పగటిపూట బ్యాట్స్‌మెన్‌లకు స్టార్‌లను చూపించగలడు. ఇక రెండో విషయం ఏంటంటే.. టీమ్ ఇండియా తన మ్యాచ్ లన్నీ ఒకే మైదానంలో ఆడాల్సి ఉంది. అంటే జట్టు స్పిన్నర్లు, ఇతర ఆటగాళ్లు పరిస్థితులను బాగా పరీక్షిస్తే.. టీమ్ ఇండియాను అడ్డుకోవడం చాలా కష్టం. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. దీని తర్వాత ఫిబ్రవరి 23న గొప్ప మ్యాచ్ జరగనుంది. అక్కడ రోహిత్ సేన మహ్మద్ రిజ్వాన్ కెప్టెన్సీలో పాకిస్థాన్ జట్టుతో తలపడుతుంది. గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో టీమిండియా మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది. భారత జట్టు సెమీఫైనల్, ఫైనల్స్‌కు చేరుకోవడంలో విజయం సాధిస్తే.. ఈ రెండు నాకౌట్ మ్యాచ్‌లు కూడా రోహిత్ సేన దుబాయ్‌లోని ఇదే మైదానంలో ఆడనుంది.

# చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్..

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో చివరి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీ సాధించాడు. ఈ సమయంలో గిల్ భారీ రికార్డు సృష్టించాడు. భారత స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వన్డేల్లో అత్యంత వేగంగా 2500 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో ఇంగ్లండ్‌తో భారత్ తరఫున 50వ వన్డే ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికా మాజీ బ్యాట్స్‌మెన్ హషీమ్ ఆమ్లా రికార్డును బద్దలు కొట్టాడు. ఆమ్లా తన 53వ ఇన్నింగ్స్‌లో వన్డేల్లో 2500 పరుగుల మార్క్‌ను అధిగమించాడు. వన్డేల్లో 2500 పరుగులు పూర్తి చేసేందుకు గిల్ మూడో మ్యాచ్‌లో 25 పరుగులు చేయాల్సి ఉంది. భారత ఇన్నింగ్స్ 10వ ఓవర్ ఐదో బంతికి ఫోర్ కొట్టి ఈ రికార్డును కూడా పూర్తి చేశాడు.  భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న సిరీస్‌లో గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఫిబ్రవరి 6న నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన సిరీస్‌లో మొదటి మ్యాచ్‌లో గిల్ 96 బంతుల్లో 87 పరుగులు చేశాడు. ఆదివారం (ఫిబ్రవరి 9) కటక్‌లోని బారాబతి స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో 25 ఏళ్ల కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 51 బంతుల్లో 60 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో అతను అద్భుత సెంచరీ చేశాడు. మూడో మ్యాచ్‌లో 102 బంతుల్లో 112 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో అతను 14 ఫోర్లు, 3 సిక్సర్లు కొట్టాడు. అంతకుముందు టీమ్ ఇండియా 50 ఓవర్లలో 356 పరుగులు చేసింది. గిల్‌తో పాటు కోహ్లీ (52), అయ్యర్ (78) కూడా ధీటుగా బ్యాటింగ్ చేశారు. ఇంగ్లండ్ తరఫున ఆదిల్ రషీద్ 64 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.



# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ ఇవే..

### మొదటి స్థానానికి చేరువగా టీమిండియా ఓపెనర్!

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో అయ్యర్ కేవలం 30 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. నాగ్‌పూర్‌లో భారత ఓపెనర్ల పేలవ ప్రదర్శన తర్వాత భారత్ విజయం సాధించడంలో అయ్యర్ ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బుధవారం బ్యాట్స్‌మెన్‌ల కొత్త వన్డే ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది, ఇక్కడ శుభమాన్ గిల్ భారీగా లాభపడ్డాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్.. ఇప్పుడు రెండో స్థానానికి చేరుకున్నాడు. వెటరన్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు కోల్పోయాడు. టాప్-10లో భారత్‌కు చెందిన నలుగురు బ్యాట్స్‌మెన్‌లకు చోటు దక్కడమే ఇక్కడ పెద్ద విషయం. గిల్ ఒక స్థానం ఎగబాకి భారత కెప్టెన్ రోహిత్ శర్మను అధిగమించాడు. ఇప్పుడు గిల్ పేరు మీద 781 పాయింట్లు ఉన్నాయి. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ర్యాంకింగ్స్ పడిపోయిన వారిలో ఉన్నారు. రోహిత్ ఒక స్థానం దిగజారి మూడో స్థానానికి రాగా, విరాట్ రెండు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వన్డేలో అర్ధశతకం సాధించిన శ్రేయాస్ అయ్యర్ టాప్-10 బ్యాట్స్‌మెన్ జాబితాలో చోటు దక్కించుకున్న కొత్త భారత ఆటగాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో అయ్యర్ కేవలం 30 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. నాగ్‌పూర్‌లో భారత ఓపెనర్ల పేలవ ప్రదర్శన తర్వాత భారత్ విజయం సాధించడంలో అయ్యర్ ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. మొదటి మ్యాచ్‌లో గాయపడిన విరాట్ స్థానంలో ఆడిన ఈ సిరీస్‌కు ముందు అయ్యర్ జట్టు ప్రణాళికలో భాగం కాలేదు. అయితే, ఇప్పుడు అతని ప్రదర్శన ఆధారంగా అతను ఛాంపియన్స్ ట్రోఫీకి నాలుగో స్థానంలో దాదాపుగా తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు.






# ఆస్ట్రేలియా కెప్టెన్ గా స్మిత్..

2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 19న ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆయా జట్లు తమ స్క్వాడ్ ను సిద్ధం చేస్తున్నాయి. తాజాగా ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. ఆస్ట్రేలియా జట్టుకు స్టీవ్ స్మిత్ నాయకత్వం వహిస్తుండగా, ఆ జట్టు ముగ్గురు స్టార్ పేసర్లు లేకుండా టోర్నమెంట్ ఆడనుంది. కంగారూ జట్టులోని ముగ్గురు స్టార్ ఫాస్ట్ బౌలర్లు, పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్ మరియు జోష్ హాజిల్‌వుడ్ జట్టులో లేరు. ఇది నిజంగా ఆస్ట్రేలియాకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఛాంపియన్స్ ట్రోఫీ నుండి తన పేరును ఉపసంహరించుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల స్టార్క్ టోర్నమెంట్ నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. అతనితో పాటు పాట్ కమ్మిన్స్ మరియు జోష్ హాజిల్‌వుడ్ కూడా టోర్నీకి దూరమయ్యారు. గాయం కారణంగా కమిన్స్ మరియు హాజిల్‌వుడ్ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. గత వారం గాలెలో శ్రీలంకతో జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్‌లో స్టార్క్ కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. స్టార్క్ ఎడమ చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. కాగా స్టార్క్, కమ్మిన్స్ మరియు హాజిల్‌వుడ్ లేకపోవడంతో ఫాస్ట్ బౌలర్లు స్పెన్సర్ జాన్సన్, నాథన్ ఎల్లిస్, సీన్ అబాట్ మరియు బెన్ ద్వార్షిస్‌లకు అవకాశం ఇచ్చారు.

# మూడు వన్డేలో భారత్ ఘనవిజయం..

### సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వన్డే సిరీస్ చివరి మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లీష్ కెప్టెన్ జోస్ బట్లర్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మొదటగా బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్య చేధనకు బరిలోకి దిగిన టీమిండియా 34.2 ఓవర్లలో 214కు కుప్పకూలి 142 పరుగుల తేడాతో ఓడిపోయింది. మూడు వన్డేల సిరీస్‌లో చివరి మ్యాచ్‌లో భారత్ 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను (%×అఆఖు జం జుఅస్త్రశ్రీఖుఅం%) ఓడించింది. ఇంగ్లండ్ టాస్ గెలిచి భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అనంతరం భారత్ 50 ఓవర్లలో 356 పరుగులకు కుప్పకూలింది. ఇందులో శు భమన్ గిల్ సెంచరీ ఇన్నింగ్స్ ఆడాడు. కాగా విరాట్, అయ్యర్ బ్యాట్‌తో అర్ధ సెంచరీలు సాధించారు. ఈ పరుగులను ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ జట్టు 214 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ తరఫున టామ్ బాంటన్ అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడాడు. చాలా కాలం తర్వాత ఇంగ్లండ్ జట్టులోకి తిరిగి వచ్చిన బాంటన్ 38 పరుగులు చేశాడు. బెన్ డకెట్ 34 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆరంభంలో తొలి 6 ఓవర్లలో ఇంగ్లండ్ 60 పరుగులు చేసింది. ఆ తర్వాత అర్ష్‌దీప్ వేసిన బంతికి భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన బెన్ డకెట్ రోహిత్ శర్మ చేతికి చిక్కాడు. దీని తర్వాత అర్ష్‌దీప్ ఫిల్ సాల్ట్‌ని తన తదుపరి బాధితుడిగా చేశాడు. సాల్ట్ 23 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జో రూట్ 23 పరుగులు చేయగా, హ్యారీ బ్రూక్ 19 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరుకున్నారు. భారత్ తరఫున అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్, హర్షిత్ రాణా అత్యధిక వికెట్లు తీశారు. ఈ బౌలర్లిద్దరూ చెరో 2 వికెట్లు తీశారు. కాగా సుందర్, కుల్దీప్ యాదవ్ చెరో విజయం సాధించారు. ఈ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. అయితే టీమిండియా తాజాగా ఈ టోర్నీకి సంబంధించి జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఛాంపియన్స్ ట్రోఫీలో ప్లాన్స్ అమలు చేస్తాం

ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం చాలా ఆనందంగా ఉందని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపారు. ఇప్పుడు సిరీస్‌లో విజయం సాధించినప్పటికి కొన్ని విషయాల్లో మెరుగు పడాలన్నారు. జట్టులో ప్రతి ఒక్కరూ నిలకడమైన ప్రదర్శన చేస్తున్నారన్నారు. ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించామని పేర్కొన్నారు. యువ క్రికెటర్లు తమ బాధ్యతలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారని కొనియాడారు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముందు ఆటగాళ్లు ఫామ్‌లోకి రావడం కలిసి వచ్చిందని రోహిత్ సంతోషం వ్యక్తం చేశారు. గత వన్డే ప్రపంచ కప్‌లో ఆడిన మాదిరిగానే ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడుతామని స్పష్టం చేశారు. ఛాంపియన్ ట్రోఫీలో అమలు చేయబోయే ప్లాన్ ఇక్కడి చెప్పలేమన్నారు. కొన్ని సార్లు మనం అనుకున్నా ఫలితాలు రాకపోవడంతో వాటి నుంచి గుణ పాఠాలు నేర్చుకుంటున్నామని రోహిత్ తెలియజేశారు. ఇంగ్లాండ్ తో జరిగిన వన్డే సిరీస్ ను 3-0తో టీమిండియా కైవసం చేసుకుంది. అలాగే టి20 సిరీస్ ను కూడా టీమిండియానే దక్కించుకుంది.





జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఆ రెస్పాన్స్ ఊహించలేదు”

నందమూరి బాలకృష్ణ కొత్త సినిమా ‘డాకు మహారాజ్’ విడుదలకు ముందు అందులోంచి రిలీజ్ చేసిన ‘దబిడి దిబిడి’ పాట విషయంలో సోషల్ మీడియా వేదికగా ఎంత ట్రోలింగ్ జరిగిందో తెలిసిందే. ఆ పాటలో నర్తించిన ఊర్వశి రౌటెలా జఘన భాగంలో కొడుతూ బాలయ్య వేసిన స్టెప్స్ చాలామందికి అభ్యంతరకరంగా అనిపించాయి. ఆ పాట రిలీజ్ చేయడం ఆలస్యం.. సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి.బాలయ్యతో పాటు డ్యాన్స్ మాస్టర్ శేఖర్ మాస్టర్‌ను చాలామంది ట్రోల్ చేశారు. ఈ ట్రోల్ మెసేజ్‌లన స్వయంగా ఊర్వశి రౌటెలానే సోషల్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం చర్చనీయాంశం అయింది. అది ట్రోలింగ్ అని తెలియక ఆమె షేర్ చేసినట్లుగా టీం తర్వాత ఏదో కవర్ చేసింది. ఆ విషయం పక్కన పెడితే.. ఇప్పుడు ఊర్వశి నేరుగా ఆ ట్రోలింగ్ గురించి స్పందించింది. ‘దబిడి దిబిడి’ పాట చిత్రీకరిస్తున్నపుడు కానీ, రిహార్సల్స్ చేస్తున్నపుడు కూడా ఆ స్టెప్స్‌లో తమకు అసభ్యకరంగా ఏమీ అనిపించలేదని ఊర్వశి తెలిపింది. సోషల్ మీడియాలో ఈ పాటపై ట్రోల్స్ రావడం పట్ల ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేసింది. “ఈ పాట కోసం ముందే రిహార్సల్స్ చేశాం. అది ప్రశాంతంగా సాగింది. అన్ని పాటలకు కొరియోగ్రఫీ ఎలా ఉంటుందో దానికీ అలాగే చేశాం. శేఖర్ మాస్టర్‌తో అంతకుముందే మూడు పాటలకు పని చేశాను. ఆయన స్టెప్స్ గురించి చెప్పినపుడు నాకు ఏమాత్రం ఇబ్బందికరంగా అనిపించలేదు.



## ‘తండేల్’ బౌండరీ దాటలేకపోయిందా?



బాహుబలి పాన్ జాతీయ స్థాయిలో సంచలనం రేపాక.. ‘పాన్ ఇండియా’ సినిమాల ఒరవడి బాగా పెరిగింది. ఐతే పాన్ ఇండియా పేరుతో బోలెడన్ని సినిమాలు వస్తున్నాయి కానీ.. వాటిలో నిజంగా దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నవి ఎన్ని అంటే వేళ్ల మీదే లెక్కపెట్టాలి. భారీ చిత్రాలను పక్కన పెడితే.. మిడ్ రేంజ్ మూవీస్‌లో కాంతార, కార్తికేయ-2, హనుమాన్ లాంటి కొన్ని చిత్రాలు మాత్రమే పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపాయి. విజయం సాధించాయి. తెలుగు నుంచి పాన్ ఇండియా చిత్రాలుగా ప్రచారంలోకి వచ్చి.. చివరికి తెలుగు రాష్ట్రాల అవతల ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిన సినిమాల జాబితా పెద్దదే. అందులోకి తాజాగా ‘తండేల్’ కూడా వచ్చి చేరింది. దీన్ని కూడా పాన్ ఇండియా చిత్రంగానే మొదలుపెట్టారు. అలాగే ప్రమోట్ చేశారు. రిలీజ్ ముంగిట కూడా ముంబయి, చెన్నై సిటీల్లో ప్రమోషనల్ ఈవెంట్లు కూడా చేశారు. కానీ ప్రభావం మాత్రం ఏమీ కనిపించడం లేదు. ‘తండేల్’ తెలుగు రాష్ట్రాల్లో మంచి ఓపెనింగ్స్ తెచ్చుకుంది. వీకెండ్ తర్వాత కూడా బలంగా నిలబడుతోంది. కానీ తెలుగు రాష్ట్రాల అవతల మాత్రం ‘తండేల్’ ప్రేక్షకుల దృష్టిని పెద్దగా ఆకర్షించలేకపోతోంది. తెలుగు సినిమాలకు మంచి ఓపెనింగ్స్ వచ్చే కర్ణాటకలో సినిమా పర్వాలేదనిపిస్తోంది.

## నాని.. డ్రీమ్ కాంబినేషన్ రెడీ?

టాలీవుడ్లో క్వాలిటీ సినిమాలు చేస్తూనే మంచి స్పీడ్ కూడా చూపించే హీరోల్లో నేచురల్ స్టార్ నాని పేరు ముందు వరుసలో ఉంటుంది. ఒకప్పుడు కేవలం క్లాస్ టచ్ ఉన్న సినిమాలే చేసిన నాని.. ఆ తర్వాత మాస్ సినిమాలు కూడా చేసి ఆ వర్గంలోనూ ఆదరణ సంపాదించుకున్నాడు. సినిమా సినిమాకూ తన మార్కెట్ కూడా విస్తరిస్తోంది. దసరా, హాయ్ నాన్న, ‘సరిపోదా శనివారం’ చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన నాని.. ప్రస్తుతం ‘హిట్-3’ లాంటి క్రేజీ మూవీలో నాని నటిస్తున్న సంగతి తెలిసిందే.ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. త్వరలోనే అతను ‘దసరా’ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ‘ప్యారడజ్’ మూవీని మొదలుపెట్టబోతున్నాడు. ఐతే ఓవైపు సినిమాలు చేస్తూనే.. మధ్య మధ్యలో కొత్త కథలు విని ఫ్యూచర్ ప్రాజెక్టులను కూడా లైన్లో పెడుతుంటాడు నాని. ఈ క్రమంలోనే అతను ఒక డ్రీమ్ కాంబినేషన్లో సినిమాకు రెడీ అయినట్లు వార్తలు వస్తున్నాయి. తెలుగులో అరుదైన దర్శకుల్లో ఒకడిగా పేరున్న శేఖర్ కమ్ములతో నాని జట్టు కట్టబోతున్నాడన్నది తాజా సమాచారం.నాని ఒకప్పటి ఫిల్మోగ్రఫీని పరిశీలిస్తే.. శేఖర్ కమ్ముల అతడికి బాగా సూటయ్యే దర్శకుడని చెప్పొచ్చు. వీరి కలయికలో సినిమా వస్తే బాగుంటుందని ఇరువురి అభిమానులూ కోరుకున్న వారే. కానీ ఎందుకో అది సాధ్యపడలేదు. ఎట్టకేలకు ఈ కాంబోలో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నానిలా కమ్ముల స్పీడుగా సినిమాలు చేసే రకం కాదు. సినిమాకు సినిమాకు మధ్య చాలా గ్యాప్ ఉంటుంది.



## ‘బ్రహ్మ ఆనందం’ను అందరూ ఆదరించాలి




మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ‘బ్రహ్మ ఆనందం’ అనే చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హొలక్కల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు ఆర్‌వీఎస్ నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. విజయవంతమైన నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను భారీ ఎత్తున నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నాగ్ అశ్విన్, అనిల్ రావిపూడి వంటి దర్శకులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఈ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ “బ్రహ్మానందం తన కొడుకుతో కలిసి చేసిన ఈ బ్రహ్మ ఆనందం మూవీని అందరూ ఆదరించాలి. ఈ మూవీని తీసిన నిఖిల్, నిర్మాత రాహుల్‌కు ఆల్ ది బెస్ట్. రఘు బాబు, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల వంటి వారు నటించడంతో పరిపూర్ణత చేకూరినట్టు అయింది. ప్రియ, ఐశ్వర్య, దివిజలకు ఆల్ ది బెస్ట్”అని అన్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ .. “నిర్మాత రాహుల్‌కు ఎంతో ప్యాషన్ ఉంది. సినిమాను ఎలా తీయాలా? అని నిత్యం ఆలోచిస్తూనే ఉంటాడు. అలాంటి వ్యక్తులతో పని చేయడం నాకు గర్వంగా అనిపిస్తోంది. డైరెక్టర్ నిఖిల్ ప్రారంభంలో నన్ను, రఘుబాబు, రాజీవ్ కనకాల వంటి వాళ్లను చూసి కాస్త తడబడేవాడు. తాత, మనవడు కలిసి చేసే ప్రయాణమే ఈ మూవీ. ఈ కథను నిఖిల్ ఎంతో అద్భుతంగా రాసుకున్నాడు. అంతే అద్భుతంగా తీశాడు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ మూవీని రిలీజ్ చేస్తున్నాం”అని తెలిపారు.

## ‘లైలా’ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ’లైలా’ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటించింది. లైలా చిత్రం ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విశ్వక్‌సేన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ “-ఆర్టిస్ట్‌గా కొన్ని పాత్రలు చేయాలని ప్రతి నటుడికి ఉంటుంది. భామనే సత్యభామనే, మేడం, చిత్రం భళారే విచిత్రం, రెమో సినిమాలు చూసినప్పుడు ఆర్టిస్టుగా ఇలాంటి గెటప్ చేయాలని ఉండేది. అలాగే ఆడియన్స్ ఇప్పుడు కొత్త కథలని, థీమ్స్ ని కోరుకుంటున్నారు. ఇలాంటి సినిమాలురాక దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతుంది. ఈ తరంలో ఒక హీరో అమ్మాయి పాత్ర వేయడం గత 20 ఏళ్లుగా మనం చూడలేదు. ఆ లోటుని భర్తీ చేయాలని ఒక మంచి కథ రావడంతో ఈ సినిమా చేయడం జరిగింది. -సినిమాలోని లైలా క్యారెక్టర్ నాకు ఇష్టమైనది. కానీ సోను క్యారెక్టర్‌కు కూడా మీరు ఫ్యాన్స్ అయిపోతారు. ఫస్ట్ హాఫ్‌లో సోను మోడల్ లైఫ్‌స్టైల్‌ని తన క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు. మూడు సమస్యల నుంచి బయటపడడానికి సోను లైలాగా మారుతాడు. అది ఏంటనేది బిగ్ స్క్రీన్ మీద చూడాలి. ఇక లేడీ గెటప్‌లోకి మారడానికి -దాదాపు రెండున్నర గంటలు పట్టేది. మేకప్ ఆర్టిస్ట్ నిక్కీ ఎక్కడ కూడా రాజీపడలేదు. లేడీ గెటప్ చాలా నేచురల్‌గా వచ్చింది.



## చరణ్ అభిమానుల్లో టైటిల్ టెన్షన్



పెద్ద హీరోల సినిమాలకు ఏ టైటిల్ పెట్టినా చెల్లుతుందనుకోవడం తప్పు. ఎంపికలో ఏ మాత్రం పొరపాటు చేసినా దాని ప్రభావం నేరుగా ఓపెనింగ్స్ మీద పడుతుంది. ఇటీవలే ‘గేమ్ ఛేంజర్’ పేరు మాస్ కి చేరలేక అప్పటికే తక్కువగా ఉన్న బజ్ ని మరింత కిందకు తీసుకెళ్లింది. ప్యాన్ ఇండియా కోసం ఇలా పెడుతున్నామని దర్శక నిర్మాతలు సమర్ధించుకోవచ్చు కానీ అన్ని వర్గాలకు అది కనెక్ట్ అయ్యేలా ఉందో లేదో చెక్ చేసుకోవడం అవసరం. రామ్ చరణ్ దర్శకుడు బుచ్చిబాబు కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రానికి ‘పవర్ క్రికెట్’ పేరుని పరిశీలిస్తున్నట్టు వస్తున్న వార్త ఫ్యాన్స్ ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.ఎందుకంటే ఈ టైటిల్ వినగానే ఏదో టీవీ రియాలిటీ షోలా అనిపిస్తోంది కానీ రామ్ చరణ్ లాంటి స్టార్ హీరో మూవీలా కాదనేది వాళ్ళ అభిప్రాయం. దీని కన్నా ఎప్పుడో ప్రచారంలోకి వచ్చిన ‘పెద్ది’నే బెస్ట్ అంటున్నారు. అయితే అన్ని భాషల్లో ఒకే టైటిల్ ఉండేలా చూసుకోవడం పెద్ద సవాల్ గా మారింది. పెద్ది అంటే తెలుగు వాళ్లకు అర్థమవుతుంది కానీ నార్త్ ఆడియన్స్ కన్ఫ్యూజ్ అవుతారు. అలాని పవర్ క్రికెట్ అని పెట్టినంత మాత్రాన పాజిటివ్ వైబ్స్ వచ్చేయవు. ప్రస్తుతానికి ఇదంతా చర్చల దశలో ఉంది కాబట్టి టెన్షన్ ఏం లేదు కానీ మార్చిలో వచ్చే చరణ్ పుట్టినరోజు లోపు డిసైడ్ చేయాలి. క్రీడల బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ విలేజ్ డ్రామాలో కుస్తీ, క్రికెట్ రెండు అంశాలు హైలైట్ అవుతాయట.

## తమిళ స్టార్‌ను మనోళ్లే కాపాడాలి

తమిళ టాప్ స్టార్లలో ఒకడైన అజిత్ కుమార్కు కొన్నేళ్ల నుంచి నిఖార్సయిన బాక్సాఫీస్ హిట్ లేదు. 2019లో వచ్చిన ‘విశ్వాసం’తో చివరగా బ్లాక్ బస్టర్ కొట్టాడు అజిత్. ఆ తర్వాత ఆయన్నుంచి వచ్చిన నీర్కొండ పార్వై, వలిమై, తునివు ఓ మోస్తరుగా ఆడాయి. అజిత్ స్టార్ పవర్ వల్ల వీటికి ఓపెనింగ్స్ అయితే వచ్చాయి కానీ.. ఆ తర్వాత బలంగా నిలబడలేకపోయాయి. ఇక లేటెస్ట్‌గా రిలీజైన అజిత్ సినిమా ‘విడాముయర్చి’.. ఆయన కెరీర్లోనే అతి పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచింది. ముందు అనుకున్నట్లు సంక్రాంతి టైంలో వస్తే సినిమా బెటర్‌గా పెర్ఫామ్ చేసేదేమో కానీ.. అన్ సీజన్ అయిన ఫిబ్రవరిలో రిలీజై, బ్యాడ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం.. బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ అనిపించుకుంది. తెలుగులో అయితే ఈ సినిమా పూర్తిగా వాషౌట్ అయిపోయింది. డిజాస్టర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన లైకా ప్రొడక్షన్స్‌ను ఈ సినిమా ఇంకా పెద్ద దెబ్బ కొట్టింది. సినిమా మీద పెట్టిన పెట్టుబడి వెనక్కి రాకపోగా.. హాలీవుడ్ మూవీ ‘బ్రేక్ డౌన్’ను ఫ్రీమేక్ చేసినందుకు వారికి చెల్లించిన డబ్బులు అదనపు భారం అయ్యాయి. లైకా సంగతి పక్కన పెడితే.. కొన్నేళ్ల ముందు వరకు స్టార్ పవర్‌లో విజయ్‌కి దీటుగా నిలిచిన అజిత్.. ఇప్పుడు తన ముందు వెలవెలబోయే పరిస్థితి. విజయ్ సినిమాల నుంచి నిష్క్రమించబోతున్న తరుణంలో నంబర్ వన్ స్థానాన్ని చేజిక్కించుకోవడానికి తాను అర్హుడినని అజిత్ చాటాల్సి ఉంది. అతడికి పెద్ద హిట్ ఇచ్చే బాధ్యత తెలుగు వారి మీదే ఉండడం గమనార్హం.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NUMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM